



కడప మార్కెట్ యార్డులో వర్షంతో తడిసిపోయిన పసుపు కొమ్ములు



బుగ్గవంక రక్షణగోడ అనుకుని ఏర్పాటు చేస్తున్న బీటీ రోడ్డు

కడప నగరం నడిబొడ్డున బుగ్గవంక ప్రవహిస్తోంది. ఇది ఎర్రముక్కపల్లె మొదలుకుని అటు బాలాజీనగర్, ఇటు ద్వారకానగర్, రవీంద్రనగర్, గుర్రాలగడ్డ, నాగరాజుపేట, వినాయకనగర్ పరిధిలో వెళుతుంది. బుగ్గవంకకు ఆనుకుని దాదాపు పదివేలకు పైగా నివాసాలున్నాయి. 2001లో ఒకసారి 2020లో మరోసారి భారీ వర్షాలతో బుగ్గవంక కడప నగరాన్ని వణికించింది. బుగ్గవంకతో జనాలకు ప్రమాదం లేకుండా ఉండేందుకు 2005లో రక్షణగోడ, సుందరీకరణ పనులకు రూ.35 కోట్లతో శ్రీకారం చుట్టారు. 20 ఏళ్లు పూర్తయినా ఈ పనులు పూర్తి కాలేదు. ఆరేళ్లు తండ్రి రాజశేఖర్‌రెడ్డి, ఐదేళ్లు కొడుకు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా పనిచేసినా.. బుగ్గవంక పనులు పూర్తి చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సా..గుతోంది..!

- బుగ్గవంక రక్షణగోడ, సుందరీకరణకు 20 ఏళ్లు
- ఆగుతూ.. సాగుతూ.. ఎప్పటికి పూర్తయ్యేనో ?..
- భారీ సాగునీటి ప్రాజెక్టును తలపిస్తున్న వైనం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగరాన్ని 2001లో వచ్చిన వరదలు ముంచెత్తాయి. భారీ వర్షాలతో బుగ్గవంక పోటెత్తింది. బుగ్గవంకకు ఇరువైపులా ఉన్న కాలనీలు జలమయమై ఆస్తినష్టం సంభవించింది. దీనికి శాశ్వత పరిష్కారం ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం అనుకున్నారు. అప్పట్లో సీఎం చంద్రబాబునాయుడు బుగ్గవంకపై సమీక్ష నిర్వహించారు. వైఎస్ సీఎం అయిన తరవాత 2005లో రూ.35 కోట్లతో బుగ్గవంక ప్రొటెక్షన్ వాల్, సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే 20 ఏళ్లు అయినా ఇంకా ఈ పనులు పూర్తి కాకపోవడం గమనార్హం. భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల్లా.. బుగ్గవంక సుందరీకరణ పనులు కూడా సాగుతుండడం గమనార్హం. ఈ 20 ఏళ్లలో ఆరేళ్లు రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటే మరో ఐదేళ్లు ఆయన కుమారుడు వైఎస్ జగన్ సీఎంగా ఉన్నారు. అయినా దాన్ని పూర్తి చేయలేకపోవడం గమనార్హం. ఆలస్యమైతే అమృతం కూడా విషంగా మారుతుందంటారు. బుగ్గవంక సుందరీకరణ విషయంలో అలాగే సాగుతోంది. 2005లో రూ.35 కోట్ల అంచనాతో పనులు మొదలుపెడితే.. ఆగుతూ సాగుతూ ఉండటంతో.. నిర్మాణ వ్యయం ఇప్పుడు రూ.80కోట్లకు పైగా చేరుకుంది.

20ఏళ్లుగా..

బుగ్గవంక రక్షణగోడ, సుందరీకరణ పనులను 2005లో రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టారు. వంకకు ఇరువైపులా 8 కి.మీ అప్రోచ్‌రోడ్డు, బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వైఎస్ మరణానంతరం అప్పట్లో కాంగ్రెస్ నేతలు ఈ పనుల్లో పర్సంటేజీల కోసం పోట్లాడుకోవడం, వాటాల పోరు కారణంగా కాంట్రాక్టరు పనులు వదిలేసి వెళ్లారు. రైతుబజారు వద్ద ఉన్న బ్రిడ్జిని మాత్రం పూర్తిచేశారు. కాంగ్రెస్ హయాంలో అలాగే కొనసాగుతూ వచ్చింది. రక్షణగోడ నిర్మాణం నత్తనడకన సా...గుతూ వచ్చింది. 2014-19 టీడీపీ హయాంలో పాత బస్టాండు వద్ద నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే బుగ్గవంకలో అక్రమ కట్టడాలు ఉండడంతో ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. 2021లో మళ్లీ వరదలు వచ్చి బుగ్గవంక పరివాహక ప్రాంతాన్ని కంటిమీద కునుకు లేకుండా చేసింది. దీంతో రక్షణగోడ నిర్మాణంలో భాగంగా అధికారులు సుమారు 300 అనుమతి లేని కట్టడాలను కూల్చారు. అప్పట్లో జగన్ సీఎం హోదాలో రోడ్లు, ఇతర బ్రిడ్జిల నిర్మాణాల కోసం కడపలో రూ.20కోట్లతో శంకుస్థాపన చేశారు.

బిల్లులే చెల్లించని వైనం

జగన్ హయాంలో బుగ్గవంక సమస్యకు ఫుల్‌స్టాప్ పడుతుందని అందరూ భావించారు. సొంత జిల్లావాసి జగన్ సీఎం కావడంతో చకచకా నిధులు ఇచ్చి వరద ముప్పు నుంచి నగరాన్ని రక్షిస్తారని భావించారు. అందుకు తగ్గట్లుగా జగన్ శంకుస్థాపనలు చేశారు. అయితే పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో ఆ పనులు అలాగే ఆగిపోయాయి.



2020 లో ఉధృతంగా ప్రవహిస్తున్న బుగ్గవంక

కూటమి ప్రభుత్వంలో కదలిక

తొలుత బుగ్గవంక ప్రొటెక్షన్‌వాల్‌తో పాటు ఇరువైపులా రోడ్లు, సెంట్రల్ లైటింగ్ వేసి దీనిని పర్యాటకకేంద్రంగా మార్చాలనుకున్నారు. తర్వాత ఆ దిశగా పనులు జరగలేదు. ఇప్పుడు చంద్రబాబు సర్కారు బుగ్గవంక పనులు పూర్తి చేయడంపై దృష్టి పెట్టింది. ఈ పనులు పూర్తికావాలంటే జగన్ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించిన రూ.26.50 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం రక్షణగోడ పూర్తయింది. 8 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇప్పటికి 2 కి.మీ పూర్తి చేశారు. బుగ్గవంక కడప నడిబొడ్డులో ఉంది. దీనికి ఇరువైపులా రోడ్లు పూర్తయితే వినాయకనగర్ నుంచి నేరుగా జిల్లా పరిషత్, ఎర్రముక్కపల్లె వరకు రోడ్ కనెక్టివిటీ పెరుగుతుంది. త్వరితగతిన పూర్తిచేస్తే కడపలో ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుంది. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బకాయిలు విడుదల చేయడంతో పాటు మిగిలన పనులకు నిధులు కేటాయిస్తే బుగ్గవంక పనులు పూర్తవుతాయి.

మూడునెలల్లో పూర్తిచేస్తాం

బుగ్గవంక సుందరీకరణ పనులు మూడు నెలల్లో పూర్తిచేస్తాం. పెండింగు బిల్లులు కూడా త్వరలో క్లియర్ అవుతాయి. బుగ్గవంక ఇరువైపులా గోడపైనే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మాధవి కృతనిశ్చయంతో ఉన్నారు. బుగ్గవంకలో వరదనీరు మాత్రమే వెళ్లాలని, డ్రైనేజీ నీరు ఇరువైపులా పోయేలా కాల్వ తీయాలని సూచించారు. ఆ మేరకు పనులు పూర్తి చేస్తాం.



- వెంకట్రామయ్య, ఇరిగేషన్ ఈఈ

అకాల వర్షం

- ఉన్నఫళంగా గాలివాన బీభత్సం
- నేలకొరిగిన ఉద్యానపంటలు
- మార్కెట్ యార్డులో తడిసిన పసుపు నిల్వలు

కడప రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటుచేసుకున్న అధిక పీడనం కారణంగా గురువారం మధ్యాహ్నం అకాల వర్షం దంచికొట్టింది. మధ్యాహ్నం 2-30 నుంచి గంటకు పైగా ఏకధాటిగా ఉరుములు, మెరుపులతో కుండ పోతగా వర్షం కురిసింది. ఈ ప్రభావం పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె, కడప మండలాల్లో తీవ్రంగా చూపింది. వరి, అరటి, బొప్పాయి, మామిడి, పసుపు పంటలకు తీవ్ర నష్టం చేకూర్చింది. వందలాది ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయి.

కడప నగరంలో ఒక గంట వ్యవధిలోనే దాదాపు 2 సెంటీమీర్ల వరకు వర్షం పడడంతో మురుగునీటి కాలువలు పొర్లి రోడ్లు జలమయం అయ్యాయి. కడప మార్కెట్ యార్డు చెరువును తలపించింది. ఇక్కడ వర్షపు నీరు బయటికి వెల్లడానికి వీలులేకపోవడంతో పసుపు నిల్వలు తడిసిపోయాయి. చింతకొమ్మదిన్నె మండలం గోపాలపురం గ్రామానికి చెందిన డి.వెంకటరెడ్డి, రామాంజనేయరెడ్డి, అప్పరాజుపల్లె గ్రామానికి చెందిన విశ్వనాధరెడ్డి, ఓబులంపల్లి గ్రామానికి చెందిన రామలింగారెడ్డి, కొత్తపేటకు చెందిన సుబ్బరాయుడుకు చెందిన పసుపు నిల్వలు వర్షపు నీటిలో మునిగిపోయాయి. రూ.10లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.



పెండ్లిమర్రి మండలంలో నేలకొరిగిన అరటితోట

పాతకడప, వాటర్‌గండి, నానాపల్లె గ్రామాలలో కోత దశకు వచ్చిన వరి పంట 100 ఎకరాలకు పైగా ఉంది. ఈ పంటపై అకాల వర్షం తీవ్ర ప్రభావం చూపింది. చింతకొమ్మదిన్నె మండలంలో దాదాపు 2 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. మండలంలోని పలు గ్రామాల్లో అరటితోటలు నెలకొరిగాయి. అలాగే బుగ్గవంక ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలోని మామితోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాయలు రాలిపోవడంతో పాటు, కొమ్మలు విరిగిపోయాయి. పెండ్లిమర్రి మండలంలో కూడా గాలి వాన బీభత్సానికి అరటి తోటలు నేలవాలాయి. నెలరోజుల్లో తెంపబోయో అరటిగెలలు విరిగి పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. చింతకొమ్మదిన్నె మండలంలో 383 ఎకరాలు, పెండ్లిమర్రి మండలంలో 91.75 ఎకరాలలో సాగుచేసిన పసుపు పంట తవ్వకాలు చేపట్టి వాటిని కల్లాలలో ఆరబోశారు. ఉన్నఫలంగా వర్షం పడడంతో పసుపు కొమ్ములు తడిసిపోయాయి. ఈ కారణంగా నాణ్యత దెబ్బతింటుందని తగిన గిట్టుబాటు ధర రావడం కష్టమని రైతులు కన్నీటి పర్యంతం అయ్యారు.

డయేరియా రహిత జిల్లాగా మార్చాలి

- టాస్క్‌ఫోర్స్ కమిటీలో కలెక్టర్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాను డయేరియా రహిత, ఆరోగ్య సహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. ఈ నెల 15 నుంచి చేపట్టనున్న డయేరియా(అతిసార) నియంత్రణ క్యాంపెయిన్‌పై గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి ఆశా వర్కర్ల ద్వారా తక్కువ బరువున్న చిన్నారులకు జింక్ ప్యాకెట్లు అందించాలన్నారు. ఆరోగ్యశాఖ సహకారంతో స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్వాడీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ కార్నర్స్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం క్యాంపెయిన్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు, ఇన్‌చార్జి డీపీవో ఖాదర్ బాషా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఎపిడమాలజిస్ట్ ఖాజామోహిద్దీన్, డీఆర్డీఏ, పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో అరుణాచలానికి
ప్రత్యేక బస్సులు

కడప కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ కోసం అరుణాచలానికి వెళ్లే భక్తుల కోసం ఈ నెల 11, 12 తేదీల్లో వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. కడప డిపో నుంచి 11న రాత్రి 10గంటలకు, 12తేదీ ఉదయం 9.30గంటలకు బస్సులు ప్రారంభమై రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా అరుణాచలం చేరుకుంటాయని పేర్కొన్నారు. బద్వేలు డిపో నుంచి 12న ఉదయం 9గంటలకు ప్రారంభమై కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా చేరుతాయని తెలిపారు. మైదుకూరు డిపో బస్సు 11న పోరుమామిళ్ల నుంచి మధ్యాహ్నం 3గంటలకు బయల్దేరి కడప, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్ మీదుగా, మరో బస్సు మైదుకూరు నుంచి మధ్యాహ్నం 3గంటలకు కడప, చిత్తూరు మీదుగా అరుణాచలం చేరుకుంటాయని వివరించారు. ప్రొద్దుటూరు డిపో నుంచి 11న సాయంత్రం 6గంటలకు బయల్దేరి మైదుకూరు, కడప మీదుగా, జమ్మలమడుగు డిపో నుంచి 11న రాత్రి 8గంటలకు బయల్దేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా, పులివెందుల డిపో నుంచి 12న ఉదయం 7గంటలకు బయల్దేరి రాయచోటి, పీలేరు మీదుగా అరుణాచలం చేరుకుంటాయని తెలిపారు. జిల్లాలోని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లా ఆసుపత్రిని పరిశీలించిన
కాయకల్ప బృందం



రోగులను విచారిస్తున్న కాయకల్ప బృందం వైద్యులు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే సేవలపై కాయకల్ప వైద్యుల బృందం పరిశీలన చేపట్టింది. గురువారం పరిశీలన బృందానికి సంబంధించి జాయింట్ డైరెక్టర్ సాగర్, రాష్ట్ర టీబీ కార్యాలయం నుంచి ప్రోగ్రాం ఆఫీసర్ రవీంద్ర కుమార్ ఆసుపత్రిలోని వార్డులు, విభాగాలు, ఓపీ, పారిశుధ్య తదితర సేవలపై రోగులను, సహాయకులను విచారించారు. ఆసుపత్రుల పనితీరునుబట్టి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కాయకల్ప అవార్డుకు సంబంధించి మూల్యాంకనం చేపట్టారు. వారివెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్ బాబు, వైద్యులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పది మూల్యాంకనం



మూల్యాంకనం ప్రక్రియను పరిశీలిస్తున్న క్యాంప్ ఆఫీసర్, డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకన ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్ లో మూల్యాంకనాన్ని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మూల్యాంకన కేంద్రానికి 1,75,934 జవాబు పత్రాలు వచ్చాయన్నారు. తొలిరోజు 12,91 0 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారన్నారు. మూల్యాంకనానికి 105 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 604 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 198 మంది స్పెషల్ అసిస్టెంట్లు హాజరయ్యారన్నారు. ఈనెల 9వ తేదీ వరకు మూల్యాంకనం జరుగుతుందని, సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు.

ఆంధ్రావాల్మీకి.. వావిలకొలను

దేశంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందిన ఒంటిమిట్ట కోదండరామాలయం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన మహానుభావులు ఎందరో ఉన్నారు. ఎందరో తమ జీవితాన్ని పూర్తిగా స్వామికి అర్పించి కోదండరాముని ఆలయ అభివృద్ధి కోసం పాటు పడ్డారు. వారిలో ఆంధ్రావాల్మీకిగా గుర్తింపు పొందిన వావిలకొలను సుబ్బారావు, బమ్మెర పోతన ముఖ్యులు. ఒకరు ఆలయ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు సంస్కృతం నుంచి వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువదించారు. మరొకరు ఇక్కడే కోదండరాముని సన్నిధిలో భాగవతం రాసి చిరస్థాయిగా నిలిచిపోయారు.

- కోదండరాముడి కోసం సర్వం అర్పించిన త్యాగధనుడు
- మహాభాగవతాన్ని కోదండరామునికి అంకితమిచ్చిన బమ్మెర పోతన

రాజంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాభద్రాద్రిగా కీర్తింపబడుతున్న ఏకశిలా నగరి ఒంటిమిట్టలో కోదండరామాలయం కోసం ఆంధ్రావాల్మీకి బిరుదాంకితుడైన వావిలకొలను సుబ్బారావు తన జీవితాన్నే త్యాగం చేశారు. దశాబ్దాల తరబడి కోవెల పదిలంగా ఉందంటే ఆయన చేసిన కృషేనని చెప్పాలి. కడప జిల్లా జమ్మలమడుగులో వావిలకొలను రామచంద్రరావు, కనకమ్మ దంపతులకు వావిలకొలను సుబ్బారావు 23 జనవరి 1863న జన్మించారు. ఎఫ్ఏ వరకు చదివిన ఆయన ఆంగ్ల ఉపాధ్యాయుడుగా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఒకరోజు స్వప్నంలో ఇద్దరు బైరాగులు కనబడి 'ఒంటిమిట్టకు రారాదా..' అని వావిలకొలను సుబ్బారావును పిలిచారట. దీనిని రామాజ్ఞగా భావించిన ఆయన ఒంటిమిట్టకు పయనమయ్యారు. ముందుగా తనకున్న ఆస్తిని అమ్మి కోదండరాముడికి సమర్పించారు. అనంతరం కోదండరామాలయ జీర్ణోద్ధరణ కోసం గోచీ ధరించి, టెంకాయ చిప్ప చేతపట్టి కాలినడకన ఊరూరా తిరిగాడు. భిక్షం రూపంలో వచ్చిన ధనాన్ని, తన శిష్యులు గురుదక్షిణగా సమర్పించిన వస్తు సామాగ్రిని, తన రచనల అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆలయం కోసమే వినియోగించారు.



వావిలకొలను సుబ్బారావు

1934లో శ్రీరామ పట్టాభిషేకం

శిధిలావస్థలో ఉన్న తూర్పు గాలిగోపురాన్ని ఆయన జీర్ణోద్ధరణ చేశారు. గోపురాలకు తలుపులు, గర్భాలయం, అంతరాలయంలో నేలను వావిలకొలను సుబ్బారావు బాగుచేశారు. కోదండరామాలయానికి ఎదురుగా ఉన్న సంజీవరాయస్వామి దేవస్థానాన్ని పునరుద్ధరించారు. శ్రీరామ సేవా కుటీరం, రథశాల, శృంగిశైలం మీద వాల్మీకి ఆశ్రమాన్ని నిర్మించారు. ఇమాంబేగ్ బావి, శ్రీరామ తీర్థాన్నీ పునరుద్ధరించారు. ఉత్సవమూర్తులకు పలు బంగారు ఆభరణాలను చేయించారు. ఆ రోజుల్లోనే సుమారు 2లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. శ్రీరామ పట్టాభిషేకాన్ని 1934లోనే కనీవిని ఎరుగని రీతిలో నిర్వహించారు.

వావిలకొలను సాహితీసేవ


వాల్మీకి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని వావిలకొలను సుబ్బారావు 'శ్రీమదాంధ్రవాల్మీకి రామాయణం' పేరుతో తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తకం 'మందరము'గా ప్రసిద్ధి చెందింది. ఒంటిమిట్ట కోదండరామాలయంలో 1908లో గ్రంథాంకిత సభ నిర్వహించారు. అప్పటి నుంచి వావిలకొలను సుబ్బారావు ఆంధ్రావాల్మీకి బిరుదును సొంతం చేసుకున్నారు. ఆయన 25సంవత్సరాల వయసులోనే మన్మధ జన్మవృత్తాంతాన్ని తెలిపే శ్రీకుమారాభ్యుదయ గ్రంథాన్ని రచించారు. కేవలం ఒక్క పూటలోనే శ్రీతల్పగిరి రంగనాయక శతకాన్ని చెప్పారు. ఆర్యనీతి, ఆర్యచరిత్ర రత్నావళి, హితచర్య మాళిక, సులభ వ్యాకరణం, సుభద్రవిజయం, వివద భగవద్గీత తదితర గ్రంథాలను రచించారు. కోదండరాముడి సేవలో జీవత పర్యంతం గడిపిన వావిలకొలను సుబ్బారావు 1 ఆగస్టు 1936న పరమపదించారు.



కోదండరాముని కోవెల

బమ్మెర పోతన ఇక్కడివాడే..

సహజ కవిత్వాన్ని సరస్వతి కటాక్షంగా పొందిన బమ్మెర పోతన విష్ణుభక్తుడు. తెలుగులో భాగవతరచన చేయడం తన పూర్వజన్మ సుకృతమని చెప్పుకున్నాడు. అటువంటి బమ్మెర పోతనది ఒంటిమిట్టే. ఈయన భాగవతరచన ఒంటిమిట్ట కోదండరాముని సన్నిధిలోనే చేశారని అంటారు. సహజ పండితునిగా కీర్తినొందిన పోతనామాత్యుడు క్రీ.శ.15వ శతాబ్దానికి చెందినవాడు. పోతన తల్లి లక్కమాంబ, తండ్రి కేశనమంత్రి, అన్న తిప్పన. పోతన ఒంటిమిట్టలో నివసించాడు. ఒక ఇల్లు, ఎకరం పొలం ఉండేది. ఒంటిమిట్ట చెరువు కట్టపై కడప-చెన్నై ప్రధాన రహదారిలో శ్రీనాథుడు పల్లకి ఎక్కిపోతూ కట్టకిందనే పొలాన్ని దున్నుతున్న పోతనను చూసి హాళికుల అని హాస్యమాడినట్లు చెబుతారు. ఒంటిమిట్టలోని కోదండరామస్వామి దేవాలయంలో పురాతనమైన పోతన విగ్రహం ఉంది. ఈ విగ్రహం ఆధారంగానే పలు ప్రాంతాల్లో పోతన విగ్రహాలను తయారు చేశారు.



రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పతకాల వేటకు వయసుతో పని లేదని నిరూపిస్తూ చిచ్చరపిడుగు అనిపించు కుంటున్నాడు రైల్వే కోడూరుకు చెందిన ఎనిమిదేళ్ల బాలుడు పునీత్ రామ్. మూడేళ్ల వయసు నుంచే కఠోర సాధన చేస్తూ విజయాల పరంపర కొనసాగిస్తున్నాడు,
రైల్వేకోడూరు పట్టణానికి చెందిన ఎన్. హరి, దేవి దంపతుల కుమారుడు పునీత్ రామ్. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. కాళ్లకు చక్రాలు కట్టుకుని ఆరేళ్ల వయసు నుంచే పతకాలు కొల్లగొడుతున్నాడు. మూడేళ్ల వయస్సులో స్కేటింగ్ శిక్షకుడు రహమతుల్లా ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభించాడు. 2019లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో మొదలైన ప్రయాణం 29 బంగారు, 10 కాంస్య పతకాలతో దిగ్విజయంగా ముందుకు సాగుతోంది. ఇతని ప్రతిభకు 2019లో చెన్నైలో ఏసియన్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు లభించింది.

చిచ్చరపిడుగు.. పునీత్‌రామ్!



గోవాలో సాధించిన బంగారు బహుమతితో పునీత్

- స్కేటింగ్‌లో అంతర్జాతీయ ప్రతిభ..
- ఎనిమిదేళ్లకే 29 బంగారు, 10 కాంస్య పతకాలు సొంతం
- ఏసియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- ఒలింపిక్స్ లక్ష్యంగా కృషి

పతకాల పంట

- తిరుపతి వేదికగా 2019 ఫిబ్రవరిలో జరిగిన ఆల్ ఇండియా రోలర్ రిలే స్కేటింగ్‌లో 3 బంగారు పతకాలు అందుకున్నాడు. అదే ఏడాది జూన్, ఆగస్టు, అక్టోబరులో గోవా, పుదుచ్చేరి, బెంగుళూరులో జరిగిన ఇండియా రోలర్ రిలే స్కేటింగ్, ఫస్ట్ ఏసియన్ ఆల్ ఇండియా రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఆరు బంగారు, రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాడు.
- 2020 జనవరిలో జరిగిన బెళగావి రూరల్ గేమ్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో మూడు బంగారు పతకాలు సాధించి అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు.
- 2020-21 ఫిబ్రవరిలో తిరుపతిలో రూరల్ గేమ్స్ అసోసియేషన్ పోటీల్లో రెండు బంగారు, రెండు కాంస్య పతకాలు సాధించాడు.
- 2021 మార్చిలో గోవాలో ఆర్ఆర్ఎస్ఎఫ్ఐ స్కేటింగ్ పోటీల్లో రెండు బంగారు, ఒక కాంస్య పతకాలతో సత్తా చాటాడు.
- 2021 జూలైలో శాప్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో ఒక బంగారు, కాంస్య పతకాలు సాధించాడు.
- 2022 జూన్‌లో ఉమ్మడి కడప జిల్లాలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఒక బంగారు పతకం, అదే ఏడాది రాష్ట్ర స్థాయిలో బంగారు, కాంస్య పతకాలతో దూసుకెళ్లాడు.
- ఇవే కాకుండా 2022 నుంచి 2024 వరకు వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో 10 బంగారు 2 కాంస్య పతకాలు సాధించి తన సత్తా చూపించాడు.

ఒలింపిక్సే లక్ష్యం

స్కేటింగ్‌లో ప్రావీణ్యం సాధిస్తానని అనుకోలేదు. మా అన్నతో పాటు, నేను స్కేటింగ్‌కు వెళ్లా. నా ప్రతిభను గుర్తించిన మా ట్రైనర్ రహమతుల్లా ప్రోత్సాహం, మా తల్లిదండ్రుల పట్టుదల నన్ను అంతర్జాతీయ పోటీలకు ఎంపిక య్యేలా చేశాయి. నాకు ఈ క్రీడంటే చాలా ఇష్టం. భారత్ తరఫున ఒలింపిక్స్‌లో రాణించాలని నా కోరిక. దేశానికి మంచి పేరు తేవాలన్నదే నా ప్రధాన లక్ష్యం. చదువుకుంటూ లక్ష్యం కోసం కఠోర సాధన చేస్తున్నాను.

\- పునీత్ రామ్

దేశం గర్వించాలి..

మా బాబుకి చిన్నప్పటి నుంచే స్కేటింగ్ అంటే ఎంతో ఇష్టం. మా పెద్ద బాబుతో స్కేటింగ్‌కె శిక్షణకు వెళ్లి స్కేటింగ్ క్రీడాపై ఇష్టం పెంచుకున్నాడు. మూడేళ్ల వయస్సువ నుంచి స్కేటింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. ఉదయం సాయంత్రం వేళల్లో దాదాపు 6 గంటలు పాటు సాధన చేస్తుంటాడు. ఒలింపిక్స్‌లో మన దేశం తరుపున ఆడాలన్న లక్ష్యంతో పాటు చదువుతోపాటు స్కేటింగ్‌లో రాణిస్తున్నాడు. పూనిత్ దేశం గర్వించదగ్గ క్రీడాకారుడు కావాలని మా కోరిక...

\- తల్లిదండ్రులు హరి, దేవి



కార్యకర్తల కష్టాన్ని గుర్తిస్తాం

- క్షణికావేశంతో అఘాయిత్యం చేసుకోవద్దు
- నారా లోకేశ్ ట్వీట్



వెంకటేశ్ ఆరోగ్య పరిస్థితిపై విచారిస్తున్న ఎన్ఆర్ఐ లోకేశ్, ఇన్‌సెట్‌లో వెంకటేశ్ (ఫైల్‌ఫొటో)

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): "టీడీపీ కార్యకర్తల కష్టాన్ని గుర్తిస్తాం.. కొన్ని కారణాలతో కొందరు క్షణికావేశాలతో అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు.. అలాంటి పని చేయొద్దని చేతులెత్తి దండం పెడుతున్నా. టీడీపీ కార్యకర్తల కష్టాలను తెలుసుకోవడానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, పరిష్కరిస్తాం" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన ఐటీడీపీ కార్యకర్త వేల్పుల వెంకటేశ్ ఆర్థిక సమస్యలతో గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స కోసం మదనపల్లెలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పై విధంగా ట్వీట్ చేశారు. దీంతో పాటు అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజును మదనపల్లెకు పంపి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేల్పుల వెంకటేశ్‌కు భరోసా కల్పించారు. ఎన్ఆర్ఐ లోకేశ్ కొణెదల ఆస్పత్రికి చేరుకుని వేల్పుల వెంకటేశ్ ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వైద్య ఖర్చుల కోసం రూ.లక్ష నగదును వెంకటేశ్ కుటుంబీకులకు అందజేశారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆస్పత్రికి చేరుకుని వెంకటేశ్‌కు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. రూ.50 వేల నగదును అందించి వెంకటేశ్ వైద్య ఖర్చులు తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు రాటకొండ గుర్రప్ప నాయుడు, దొరస్వామినాయుడు, ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పెరవలి నవీన్, నిరంజన్‌నాని, మాజీ కౌన్సిలర్ శేషు, చరణ్, గగన్‌సాయి, తదితరులు పాల్గొన్నారు. కాగా.. వెంకటేశ్ తన ఫేస్‌బుక్ ఖాతాలో తాను టీడీపీని నమ్మి ఐదేళ్లుగా నష్టపోయానని, తాను చనిపోయిన తరువాతైనా తన కుటుంబాన్ని, పిల్లల చదువుకు సీఎం, మంత్రి నారాలోకేశ్ సాయం చేయాలని పోస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

వన్యప్రాణిని కాపాడిన గ్రామస్థులు



సిద్దవటం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టక్కోలి గ్రామం బీసీ కాలనీలోకి గురువారం వచ్చిన దుప్పిని స్థానికులు కుక్కల బారినుంచి కాపాడారు. వేసవికాలం కావడంతో దాహం కోసం గురువారం దుప్పి గ్రామంలోకి వచ్చింది. దీనిపై కుక్కలు దాడి చేసేందుకు యత్నించగా గ్రామస్థులు కాపాడి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన కడప ఫారెస్ట్ రేంజి అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని దుప్పిని అటవీ ప్రాంతంలో వదిలివేశారు.

పిడుగుపాటుకు మూడు ఆవులు మృతి



పెద్దమండ్యం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు, పిడుగుపాటుకు 3 ఆవులు మృతి చెందాయి. పెద్దమండ్యం మండలంలోని పలుచోట్ల గురువారం సాయంత్రం అర్ధగంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. చెరువుకిందపల్లి ప్రాంతంలో చింతచెట్టుపై పిడుగు పడడంతో ఆ చెట్టుకింద ఉన్న 3 పాడి ఆవులు అక్కడిక్కడే మృతిచెందినట్లు బాధిత రైతు నాగేశ్వరనాయుడు తెలిపాడు. దీంతో రూ.2.40 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి బాధితుడిని ఫోన్ ద్వారా పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

తేనెటీగల దాడిలో వృద్ధుడికి గాయాలు



చికిత్స పొందుతున్న వృద్ధుడు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో ఓ వృద్ధుడు గాయపడ్డాడు. మదనపల్లె పట్టణం, రాజారెడ్డి కాలనీకి చెందిన ఎం.చలపతి నాయుడు(80) గురువారం మండలంలోని కొత్తపల్లె పంచాయతీలోని పొలంలో పనులు చేస్తూ చెత్తకు నిప్పు పెట్టడంతో పక్కనే చెట్టులోని తేనెటీగలు చెదిరిపోయాయి. సమీపంలోనే ఉన్న వృద్ధుడిపై దాడి చేశాయి. ఈ దాడిలో గాయపడిన వృద్ధుడిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గంగమ్మ జాతరలో ఘర్షణ ముగ్గురికి గాయాలు

సిద్దవటం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతరలో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించే బోనం విషయంలో ఘర్షణ జరగడంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని నేకనాపురం ఎస్సీ కాలనీలో గురువారం గంగమ్మ జాతరలో బోనం వివాదం జరిగింది. దీంతో అదే గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తి బడిసెతో దాడి చేయగా వెంకటసుబ్బయ్య, గంగాదేవి, పావని గాయపడ్డారు. వీరిని గ్రామస్థులు సిద్దవటం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడ్డ వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు విచారిస్తున్నామని సిద్దవటం ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

పెయింటర్స్ కాలనీలో చోరీ

బి.కొత్తకోట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని పెయింటర్స్ కాలనీలో పట్టపగలే చోరీ జరిగిందని బాధితులు తెలిపారు. కాలనీలో నివాసం ఉండే బావాజాన్ కుటుంబం గురువారం ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లగా, దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి, రూ.90 వేల విలువ చేసే బంగారం, కొంత నగదు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డిప్యూటీ కలెక్టర్ వినాయకంపై విచారణ

- గతంలో బద్వేలు తహశీల్దారుగా పనిచేసిన వినాయకం
- కమలాపురం తహశీల్దారు, కలసపాడు డీటీ, ఇద్దరు వీఆర్వోలపైనా..

కలికిరి /కడప, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గతంలో బద్వేలు తహశీల్దారుగా పనిచేసి ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టు భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న కె.వినాయకంపై విచారణకు ఆదేశిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతోపాటు గతంలో బద్వేలు తహశీల్దారు కార్యాలయంలో ఏఆర్ఐగా పనిచేస్తూ ప్రస్తుతం కలసపాడు డిప్యూటీ తహశీల్దారుగా వున్న కె.నాగవాహిని , అప్పట్లో బద్వేలులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ప్రస్తుతం కమలాపురం తహశీల్దారుగా ఉన్న జీవీ మధురవాణిపై కూడా ఈ విచారణ జరుగనుంది. అప్పట్లో బద్వేలు మండలం చెన్నంపల్లెలో పనిచేసి ప్రస్తుతం సీకే దిన్నె మండలం కొప్పర్తి వీఆర్వోగా పనిచేస్తున్న ఎం.ప్రతాప్ రెడ్డి, చెన్నంపల్లె మరో వీఆర్వోగా పనిచేసి ప్రస్తుతం సీకే దిన్నె మండలం ఊటుకూరు వీఆర్వోగా ఉన్న బి.సుప్రజపై కూడా ఈ విచారణ కొనసాగనుంది.

గతంలో బద్వేలు తహశీల్దారు కార్యాలయంలో పనిచేసిన కాలంలో వీరంతా మండలంలోని బాకరాపేట చెరువుకు సంబంధించిన 1797 సర్వే నంబరులో అక్రమంగా ఇళ్ల స్థలాలు కేటాయించారన్నది ప్రధాన ఆరోపణ. దీనిపై కడప జిల్లా కలెక్టరు 2021 అక్టోబరు 18 ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించారు. రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన అనర్హులైన వారికి ఇళ్ల స్థలాల పేరుతో చెరువు భూమిలో పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరులో ఈ ఐదుగురు అధికారులు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడి లబ్ధిదారుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నారని ఈ నివేదికలో కలెక్టరు స్పష్టం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురి నుంచి దీనికి సంబంధించిన సంజాయిషీలు సమర్పించాలని 2022 అక్టోబరు 27 ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. వీటిని పరిశీలించిన ప్రభుత్వం మరింత లోతుగా విచారణ చేయించడానికి నిర్ణయించింది.

విచారణ అధికారిగా కడప జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను నియమించింది. ఆమెకు విచారణలో సహకరించడానికి ప్రెజెంటింగ్ అధికారిగా కడప డీఆర్వోను కూడా నియమిస్తూ ఆరు వారాల్లోగా విచారణ నివేదికను సమర్పించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా గురువారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

మండలమీట్‌లో హైడ్రామా

వచ్చినట్టే వచ్చి సమావేశాన్నిబహిష్కరించిన ఎంపీటీసీ సభ్యులు



మరోసారి అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఇస్తున్న ఎంపీటీసీ సభ్యులు

బి.కొత్తకోట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలమీట్ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో గురువారం హైడ్రామా నడిచింది. ఇంతకు మునుపు కూటమి నాయకులు అడ్డుకున్నారని ఒకసారి.. కోరం లేదని మరోసారి మండలమీట్ వాయిదాపడింది. మూడవసారి సమావేశం జరగాలి, సభ్యులు హాజరైతీరాలి. లేదంటే మండలబాడీనే రద్దయ్యే అవకాశం ఉంది. ఈ లోగా ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ మిగతా సభ్యులు నోటీసు ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం సమావేశం జరపాలని ఎంపీడీవో దిలీప్‌కుమార్ నిర్ణయించారు. మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీ సభ్యులుండగా అందరూ వైసీపీకి చెందినవారే. వీరిలో గుమ్మసముద్రం సభ్యురాలైన లక్ష్మీనరసమ్మను అప్పట్లో ఎంపీపీగా ఎన్నుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక జరిగిన పరిణామాల నేపథ్యంలో ఎంపీపీతో మిగతా సభ్యులకు పొసగలేదు. దీంతో గురువారం నాటి సమావేశానికి కోరం ఉంటుందా లేదా అనే అనుమానం తలెత్తింది. అయితే నిర్ణీత సమయానికి అందరూ హాజరయ్యారు. రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. కోరం ఉన్నందున సమావేశాన్ని ప్రారంభిస్తున్నామని ఎంపీడీవో ప్రకటించగానే 10 మంది సభ్యులు మూకుమ్మడిగా పోడియం వద్దకు చేరుకుని మరోసారి అవిశ్వాసం నోటీసును ఎంపీడీవోకు అందజేశారు. తాము ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని, విధానపరమైన నిర్ణయాలు, తీర్మానాలు చేయరాదని చెప్పి బయటకు వెళ్లిపోయారు. ఎంపీటీసీ సభ్యుల సంతకాలు ఉన్నందున సభలో వారు లేకుండానే ఎంపీడీవో సమావేశాన్ని కొనసాగించి మమ అనిపించారు. గతంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో సీఐ జీవన్‌గంగానాథ్‌బాబు అదనపు బలగాలను రప్పించి బందోబస్తును పర్యవేక్షించారు. కాగా.. మండలమీట్‌లోనూ, అనంతరం జరిగిన మీడియా సమావేశంలోనూ ఎంపీపీ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ ఆరు నెలల నుంచి మండలపరిషత్‌లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, తన సంతకాలు లేకుండా రూ.72 లక్షలు విత్‌డ్రా చేసుకున్నారని, ఆ డబ్బు ఎవరి ఖాతాలలోకి పోయిందన్న విషయం తేలాలన్నారు.

భూమి ఆన్‌లైన్ చేయలేదని.. రైతు ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ రైతు వెంకటాద్రి (ఫైల్‌ఫొటో)

వాల్మీకిపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన భూమితో పాటు మిగిలిన తమ భూమికి ఆన్‌లైన్ చేసుకోవాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగివేసారిన ఓ రైతు తీవ్ర మనస్తాపానికి గురై ఉరివేసుకున్న సంఘటన గురువారం అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు..
వాల్మీకిపురం మండలం టేకలకోనం సమీపంలోని పెద్దవాకపల్లెకు చెందిన చంద్రగిరి లక్ష్మయ్య మిలటరీలో పనిచేసి రిటైర్ అయ్యారు. మిలటరీ కోటా ద్వారా మండలంలోని సర్వే నెంబరు 1051లో 5.51ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి ఆయన ఏక్‌సాల్ పట్టా పొందారు. ఆయన మరణానంతరం లక్ష్మయ్య భార్య అలివేలమ్మ, వరి కుమారుడు చంద్రగిరి వెంకటాద్రి అదే భూమిలో ఇల్లు కట్టుకుని, వ్యవసాయ బోరు వేసుకుని మూడు దశాబ్దాలుగా వ్యవసాయం ద్వారా జీవనం సాగిస్తున్నారు. అనంతరం వీరి అనుభవంలోని 5.51ఎకరాల భూమిలో దాదాపుగా 3.5ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. అందులో ఇద్దరు రైతులు రెండు ఎకరాలకు పైగా ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసుకున్నారు. మిగిలిన కొంత భాగంలో జగనన్న కాలనీ కోసం స్థలాలను కేటాయించారు.
దీంతో చంద్రగిరి వెంకటాద్రి(59) ఆక్రమణకు గురైన భూమిని తిరిగి తనకు ఇప్పించాలని, మిగిలిన భూమిని రెవెన్యూ రికార్డుల ద్వారా ఆన్‌లైన్ చేయాలంటూ కొద్ది సంవత్సరాలుగా కలెక్టర్ కార్యాలయంతో పాటు స్థానిక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. అయినా రెవెన్యూ అధికారులు స్పందించక పోవడంతో మనస్తాపం చెందిన వెంకటాద్రి.. ఆక్రమణకు గురైన తన భూమి కనీసం తన బిడ్డలకైనా దక్కాలని ఆక్రమణదారుల పేర్లతో పాటు తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది పేర్లను సైతం సూసైడ్ నోట్‌లో రాసి, తన చేతిపై కూడా ఆక్రమణదారుల పేర్లను రాసుకుని తన ఇంటి సమీపంలోని చెట్టుకు గురువారం ఉరివేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పతికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.
దీనిపై వాల్మీకిపురం తహశీల్దార్ పామిలేటి మాట్లాడుతూ.. తాను ఆరునెలల క్రితమే వాల్మీకిపురం తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టానన్నారు. తన వద్దకు రైతు వెంకటాద్రి వచ్చి తన భూమి ఆక్రమణకు గురైందని, భూమిని ఆన్‌లైన్ చేయమని కోరాడన్నారు. అయితే ఆయన అడుగుతున్న భూమి కుంట పోరంబోకు అని హైకోర్టు నిబంధనల మేరకు దానిని రైతు పేరుతో ఆన్‌లైన్ చేయలేమని అన్నారు.

ఉరి వేసుకుని యువకుడు..



మృతుడు షేక్ అన్వర్

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇమామ్ సాబ్ వీధికి చెందిన యువకుడు షేక్ అన్వర్(27) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల సమాచారం మేరకు... అన్వర్ పట్టణంలోని ఓ కిరాణా దుకాణంలో పనిచేస్తూ మద్యానికి బానిస అయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని రాపూర్‌లో ఉన్న తమ బంధువుల ఇంటికి పంపించారు. అక్కడ కూడా తన ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తండ్రి బషీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : జేసీ

కురబలకోట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ సూచించారు. గురువారం మండలంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో మదనపల్లె డివిజన్ పరిధిలోని రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్దిష్ట సమయంలోగా పూర్తిచేయాలన్నారు. రీ సర్వేలో ఎటువంటి పొరబాట్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కోర్టులలో వివాదాలు నడుస్తున్న భూముల జోలికి వెళ్లవద్దన్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ఆ భూములను కాపాడుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితులలో తమ పరిధిలో లేని పనులను చేయకూడదన్నారు. రెవెన్యూలో పలు అంశాలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. హౌసింగ్‌లో అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు, లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.307



సూచనలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

కలికిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు దినసరి కనీస వేతనాన్ని రూ.307లుగా కేంద్రం నిర్ణయించిందని, దీనికి తగ్గకుండా ఉపాధి హామీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ వెంకటరత్నం సూచించారు. వేసవి కాలంలో ప్రతి రోజూ నిర్దీత లక్ష్యాల మేరకు కూలీలకు తప్పనిసరిగా పని కల్పించాలని ఆదేశించారు. గురువారం స్థానిక సీఎల్ఆర్సీ కార్యాలయంలో వాల్మీకిపురం, కలికిరి, పీలేరు, కేవీపల్లె మండలాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను ఈ నెల 10వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. ఫారంపాండ్ పనులను వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు. చెరువులలో మట్టి తవ్వకం పనులకు ఇదే మంచి సమయమని, దాంతో కూలీలకు వంద శాతం పనులు కల్పించాలన్నారు. పండ్లతోటల పెంపకం కోసం రైతులను గుర్తించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పంచ ప్రాధాన్యతా పనులపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కలికిరి క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసులు, నాలుగు మండలాల ఏపీవోలు, జూనియర్ ఇంజినీర్లు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు, సీఎల్ఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో రామాపురం, గాలివీడు, వీరబల్లి, లక్కిరెడ్డిపల్లెలకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రస్థాయి సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కనీసం ఇంతవరకు 50 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారంలోపు వందశాతం విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకుంటే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు అందుతాయన్నారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఒక్కొక్క మండలానికి రూ.9 లక్షల మంజూరు చేశారని, రైతులు రైతు భరోసా కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు.

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు

జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

సంబేపల్లె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రౌతుకుంట గ్రామంలో జరుగుతున్న మలాథియాన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటకి స్ప్రేయింగ్ తప్పక చేయించుకోవాలని సూచించారు. వేసవి కాలం కావడంతో ఆరు బయట నిద్రిస్తుంటారని, దోమతెరలు వాడాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పేడ దిబ్బలు గృహాలకు దూరంగా వేసుకోవాలన్నారు. వీధుల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేని తప్పక పాటించాలని సిబ్బందికి సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, నీరు ఎక్కువగా తాగి వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, సీహెచ్‌వో రాణి, సదాశివారెడ్డి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతలను సన్మానిస్తున్న వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ, ఇతర సభ్యులు



జిల్లాకు కీర్తి తెచ్చిన జిల్లా రచయితల సంఘం

● వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ

కడప కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఉగాది పురస్కారాలకు జిల్లా రచయితలసంఘం నుండి ముగ్గురు ఎంపిక కావడం అభినందనీయమని, ఇది మన జిల్లాకు గర్వకారణమని వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ అన్నారు. గురువారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జిల్లా రచయితల సంఘం నిర్వహించిన సత్కార కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, జింకా సుబ్రమణ్యం చేసిన సాహిత్య కృషికి ఉగాది పురస్కారాలు లభించడం హర్షణీయమన్నారు. అనంతరం మైనార్టీ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి డాక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి, కార్యదర్శులు భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, డాక్టర్ పొదిలి నాగరాజు, సభ్యులు డాక్టర్ పెద్దిరెడ్డి, నీలవేణి, హరిభూషణ్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, ముడియం కిశోర్, రామాంజనేయులు, మధు, భారవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అందిస్తున్న ఉచిత న్యాయసహాయాన్ని ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం పురుషులు, మహిళల కేంద్రకారాగాలతో పాటు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన విజిట్ చేశారు. ఈ సందర్భంగా మానసిక వాధిగ్రస్తులైన ఖైదీలతో మాట్లాడి వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో డాక్టర్ సలహాలను తీసుకుంటూ మందులను వాడాలని సూచించారు. అనంతరం జైలు పరిసరాలను, టాయిలెట్లను, ఫిర్యాదుల బాక్సును పరిశీలించారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యత, ఖైదీల హక్కులు, ఉచిత న్యాయసహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100 గురించి వివరించారు.

చెన్నూరువాసి కువైట్‌లో మృతి



మృతి చెందిన చిన్నదర్గయ్య (ఫైల్)

చెన్నూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరుకు చెందిన మండ్లూరు చిన్నదర్గయ్య (50) ఇటీవల కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబపోషణ కోసం కొన్నేళ్లుగా కువైట్‌లో ఉన్న చిన్నదర్గయ్య గతనెల 29న అక్కడ కూలీ పనులకు వెళ్తూ ఒక్కసారిగా కుప్పకూలిపడిపోయాడు. గమనించిన ఇతర కూలీలు అతన్ని ఆసుపత్రిలో చేర్పించారు. బ్రెయిన్‌డెడ్ కావడంతో మరుసటి రోజు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా అదేరోజు కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారికి అర్థం కాక అసలు ఏం జరిగింది, ఎలా జరిగిందని అక్కడ ఉన్న ఇతరులకు ఫోను చేసి సమాచారం తెలుసుకోవడం జరిగింది. చిన్నదర్గయ్య గుండెపోటుతో పాటు బ్రెయిన్‌డెడ్ కావడంతో అతని శరీరంలోని గుండె, ఊపిరితిత్తులు, ఇతర కొన్ని భాగాలను ఇతరులకు అమర్చేందుకు అక్కడి వైద్యశాలకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని చెన్నూరుకు పంపించారు. ఈ క్రమంలో మృతదేహాన్ని భారతదేశం తీసుకువచ్చేందుకు కుటుంబసభ్యులు ఎంతో శ్రమపడ్డారు. ఎట్టకేలకు మృతదేహం చెన్నూరుకు చేరడంతో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి



ఆటోలో మృతిచెందిన అజీజ్

జమ్మలమడుగు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో దానవులపాడు-చలివెందుల గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుపై ఆటోలో గురువారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో షేక్ మహ్మద్‌అజీజ్ (40) మృతి చెందాడు. ఉదయం 9 గంటల సమయంలో ఏపీ39వీడి6438 నంబరు ఆటోలో టెంకాయల లోడు వేసుకుని జమ్మలమడుగుకు వచ్చాడు. అన్‌లోడ్ చేసి తిరిగి ప్రొద్దుటూరుకు వెళుతుండగా ముక్కు నుంచి రక్తం కారిందని స్థానికులు కనుగొని పోలీసులకు తెలిపారు. పోలీసులు వచ్చేసరికి అతను మృతి చెందడంతో మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ప్రమాదాలకు నిలయం.. చెన్నూరు క్రాసింగ్



● చీకటి పడితే భయంభయం
● హైవేలో మలుపు వద్ద ఏపుగా పెరిగిన చెట్లు
● తొలగించాలంటున్న ప్రజలు



ప్రమాదకరంగా ఉన్న చెన్నూరు క్రాసింగ్

చెన్నూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ప్రధాన గ్రామంలోకి వచ్చే క్రాసింగ్ గత కొన్నేళ్లుగా ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ ప్రాంతంలో రాత్రివేళ లైట్లు లేకపోవడంతో చీకటి పడితే హైవే దాటి గ్రామంలోకి రావాలంటే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు, లేదా వికలాంగులవుతున్నారు. అయినప్పటికీ ఇక్కడ సరైన చర్యలు చేపట్టకపోవడంతో చీకటి పడితే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డుదాటాల్సిన పరిస్థితి. ఈ విషయంపై గతంలో ఎన్నోమార్లు అధికారులకు విన్నవించినా రోడ్డుపాలయ్యాయని ప్రజలు వాపోతున్నారు. 2012 నుండి హైవే రహదారి ఫోర్‌లేన్‌గా మారింది. అంతకు ముందు రెండు లైన్ల రహదారి ఉన్నప్పుడు ఈ క్రాసింగ్ వద్ద ప్రమాదాలు జరిగేవి కావు. అప్పట్లో ట్రాఫిక్ తక్కువగా ఉండేది. అయితే హైవే పనులు పూర్తవడంతో వాహనాల రాకపోకలు పెరిగాయి, దీంతోపాటు వేగమూ పెరిగింది. అలాగే మలుపు కనిపించకుండా అడ్డంగా ఏపుగా దుబాయ్ చెట్లు పెరిగిపోయాయి. ఈ క్రమంలో రోడ్డును దాటుకుని ప్రజలు చెన్నూరు ప్రధాన గ్రామంలోకి రావాలంటే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉంది. కనీసం లైట్లు అయినా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రాణాలు చేతిలో పెట్టుకుని..

క్రాసింగ్ వద్ద 20 ఏళ్లుగా ఎన్నో ప్రమాదాలు జరిగాయి. అయితే 2012 నుండి ప్రమాదాలు మరీ ఎక్కువ అయ్యాయి. చీకటి పడితే క్రాసింగ్ చూస్తేను గుండె దడదడలాడే పరిస్థితి వచ్చింది. పోలీసుస్టేషన్‌లో 30 ఏళ్ల రికార్డులు పరిశీలిస్తే సుమారు 100 నుండి 150వరకు ఇదే ప్రాంతంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి.



మలుపు కనిపించకుండా ఏపుగా పెరిగిన చెట్లు

లైట్లు ఏర్పాటు చేయాలి..



క్రాసింగ్ వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రాత్రివేళ వచ్చే వాహనాల వేగానికి రోడ్డు దాటుకోవాలంటే ఒక్కోసారి పది నిమిషాలు కూడా పడుతుంది. ఒకవేళ రోడ్డు దాటాలనుకున్నా ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం. హైవే అధికారులకు ఎన్నోమార్లు చెప్పాం. రోడ్డు మూస్తాం అంటున్నారు తప్ప ప్రమాదాల నివారణకు చర్యలు మాత్రం చేపట్టడం లేదు. లైట్లు వేస్తే దాని వెలుతురులోనైనా కొంతవరకు ఇబ్బంది లేకుండా రోడ్డు దాటవచ్చు. - ఎస్.మహబూబ్‌బాష, చెన్నూరు

అరటి తోటను పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



అగ్నికి ఆహుతైన అరటి తోట

ముద్దనూరు ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి నల్లబల్లె గ్రామ సమీపంలోని వాసుదేవరెడ్డికి చెందిన అరటితోట ప్రమాదవశాత్తు గురువారం అగ్నికి ఆహుతైంది.దీంతో భారీ నష్టం వాటిల్లింది. బాధితుడి సమాచారం మేరకు... దాదాపు 5ఎకరాల్లో అరటితోట సాగు చేశానని, రెండు వేల పైచిలుకు అరటి చెట్లు రెండవ కాపు వచ్చాయన్నారు. అరటితోట కాలిపోతోందని సమాచారం అందిన వెంటనే తోటవద్దకు వెళ్లి చూడగా చెట్లు కాలిపోతున్నాయని వాపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.16లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

దువ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌడీషీటర్లకు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ యాదవ్ గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రవర్తన మార్చుకుని మెలగాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడటం, రౌడీయిజం చేయడం లాంటి చెడుప్రవర్తనలకు దూరంగా ఉండాలని, సత్‌ప్రవర్తనతో మెలగకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వినోద్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

● ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఎన్డీఏ కుట్ర
● మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా




విలేకరులతో మాట్లాడుతున్న అంజాద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా మండిపడ్డారు. వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకే ఎన్‌డీఏ సర్కార్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. గురువారం నగరంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం తమ మతాలను ఆచారాలను పాటించుకునే అవకాశం ఉందన్నారు. మతపరమైన సంస్థలు నడుపుకోవడానికి కూడా రాజ్యాంగం ఆర్టికల్ 26లో స్వేచ్ఛను కల్పించిందన్నారు. ఆర్టికల్ 300 ప్రకారం వచ్చిన వారికి దానం చేసే హక్కును కూడా కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. వీటన్నింటికి వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేకంగా ఉందని, ఇది రాజ్యాంగ ఉల్లంఘనేనని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎన్‌డీఏ ప్రభుత్వం తూట్లు పొడుస్తూ మైనార్టీలకు అన్యాయం చేస్తూ బిల్లు ప్రవేశపెట్టారని తెలిపారు. వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వానికి చెందుతాయని కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడడం దారుణమన్నారు. ప్రధాని మోదీ పదేళ్లుగా మైనార్టీల అభ్యున్నతి కోసం ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కూటమి పార్టీల ఎంపీలంతా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైసీపీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ప్రత్యేక బస్సులు

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి



కడప మారుతీనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా కోదండరాముడి కల్యాణోత్సవానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు కడప డిపో నుండి 35 ప్రత్యేక బస్సులు, పులివెందుల డిపో నుండి 10, బద్వేలు డిపో నుండి 20, జమ్మలమడుగు డిపో నుండి 10, మైదుకూరు డిపో నుండి 5, ప్రొద్దుటూరు నుండి 15, ఇతర డిపోల నుండి మరో 40 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా భక్తుల కోసం కడపవైపు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలం నుండి కల్యాణోత్సవం జరిగే ప్రాంతం వరకు ఐదు ఉచిత బస్సులను, అలాగే రాజంపేట వైపు సాలాబాద్‌క్రాస్ పార్కింగ్ స్థలం నుండి మరో ఐదు ఉచిత బస్సులను టీటీడీ సౌజన్యంతో నడుపుతున్నామన్నారు. జిల్లాలోని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాములోరి కల్యాణాన్ని తిలకించి పులకించాలని కోరారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

● 16.50లక్షల నగదు స్వాధీనం

పులివెందుల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం అంబకపల్లె గ్రామ సమీపంలోని కొండలలో జూదమాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రమణ తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం రాత్రి 8గంటల ప్రాంతంలో జూదస్థావరంపై దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో ఏడుగురు జూదగాళ్లు, ముగ్గురు డ్రైవర్లను అరెస్టు చేసి.. మూడు కార్లతో పాటు రూ.16.50లక్షల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే ఈ విషయంపై మీడియాకు పొక్కనీయకుండా వ్యవహరించారు. ఇదిలా ఉండగా పట్టుబడిన నగదు రూ.20లక్షలకు పైమాటే ఉన్నట్లు సమాచారం. ఇంత పెద్దఎత్తున నగదు పట్టుబడినప్పటికి మీడియాతో మాట్లాడేందుకు పోలీసులు సుముఖత వ్యక్తం చేయకపోవడం గమనార్హం.

బాలిక అదృశ్యం



జమ్మలమడుగు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కోవెలకుంట్ల రోడ్డులో లక్ష్మినగర్‌కు చెందిన ఎం.ప్రత్యూష (16) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ప్రత్యూష బుధవారం నుంచి కనబడటం లేదని తల్లి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ ఫోన్‌పే యాప్‌తో.. మోసం చేసిన యువకుల అరెస్టు

చాపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన గుజ్జు సాయి, లక్ష్మిపేట గ్రామానికి చెందిన భూమిరెడ్డి వీరాంజనేయరెడ్డి, చాపాడు గ్రామానికి చెందిన ముత్యాల శివశంకర్‌లను గురువారం అరెస్టు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ భవానీ, ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఈ ముగ్గురు యువకులు గత నెల 30న చాపాడులోని పెంచల నరసంహ జనరల్‌స్టోర్ యజమాని నరసింహులును కత్తితో బెదిరించి అంగడిలోని సరుకులను తీసుకుపోయారని, మూడు నెలలుగా ఇలా చేస్తూ సుమారు రూ.3 లక్షలు విలువచేసే సరుకులను తీసుకుపోయారన్నారు. నకిలీ ఫోన్‌పే యాప్‌ను వారి సెల్‌ఫోన్‌లో తయారు చేసుకుని మోసం చేశారన్నారు. వారి వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, కత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై ఇంతకుముందు వేరే పోలీసుస్టేషన్లలో కేసులు కూడా ఉన్నాయని తెలిపారు.

రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి

● రిమ్స్‌లో భోజన నాణ్యతను తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు



రిమ్స్‌లో భోజనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ రోగులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులు షంషీర్‌ఖాన్, హరిత తెలిపారు. నగర శివారులోని రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న భోజన నాణ్యతను గురువారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాన్ని స్వయంగా పరీక్షించారు. రోగులకు అందుతున్న భోజనం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్యశ్రీ అమలవుతున్న ప్రైవేటు ఆసుపత్రుల్లో డైట్ కాంట్రాక్టర్లు అందిస్తున్న భోజనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నాణ్యతలో ఎక్కడైనా లోపం కనిపిస్తే స్టేట్ ఫుడ్ లేబొరేటరీకి పంపించి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

రేషన్‌కార్డు తొలగించారు

● దీంతో పింఛనూ రాలేదు
● చిన్నమాచుపల్లెలో ఓ పేద మహిళ ఆవేదన



రేషన్‌కార్డు తొలగించారని తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన భాగ్యమ్మ

చెన్నూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తన పేరు తొలగించి రేషన్‌కార్డు లేకుండా చేశారని చిన్నమాచుపల్లె దళితవాడకు చెందిన పైడికాల్వ భాగ్యమ్మ (60) ఆవేదన వ్యక్తం చేసింది. గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన భాగ్యమ్మ అక్కడి సిబ్బందికి తన బాధ తెలిపింది. తనకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారని, చాలాఏళ్లుగా భర్త నుండి వేరుపడి ఒంటరిగా జీవిస్తున్నానని, పిల్లలందరికీ పెళ్లిళ్లు అయ్యాయని, ఎవరూ తనను పట్టించుకోవడం లేదని వాపోయింది. నాలుగు నెలలక్రితం వరకు కూడా తనకు రేషన్ బియ్యం వచ్చేవని, ఆ బియ్యంతోనే జీవనం సాగిస్తున్నానని తెలిపింది. నాలుగు నెలలుగా బియ్యం రాకపోవడంతో కారణమేంటని అడిగితే తన రేషన్‌కార్డు లేదని చెబుతున్నారని వాపోయింది. గతంలో పెన్షన్ వస్తుండగా అది కూడా రాకుండా ఆపేశారని ఆవేదన వ్యక్తం చేసింది. భర్త నుండి విడిపోయి ఒంటరి మహిళ కావడంతో గతంలో రూ.200 పింఛను ఇచ్చేవారని, తరువాత వెయ్యి ఇచ్చేవారని, ఏమైందో తర్వాత పింఛను ఆపేశారని తెలిపింది. తన రేషన్‌కార్డు ఇచ్చి పింఛను మంజూరు చేయాలని కోరింది. ఉన్నతాధికారుల సమావేశానికి వెళ్లిన తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆయన రాగానే సమస్యను పరిష్కరిస్తామని రెవెన్యూసిబ్బంది తెలిపారు.

వైవీయూ క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన

● 160 మంది ఎంపిక

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. ప్రముఖ బయోకాన్ మల్టీనేషనల్ కంపెనీ వైవీయులో చేపట్టిన ఎంపికలకు తిరుపతి, వైజాగ్, గుంటూరు, రాజమండ్రి, బాపట్ల, అన్నమయ్య, కడప జిల్లాల నుంచే కాకుండా చత్తీస్‌ఘడ్, ఒడిస్సా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి 500 మంది ఇంజనీరింగ్, డిగ్రీ, పీఈ అర్హత గల అభ్యర్థులు హాజరయ్యారు. వైవీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథ్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ ఈ క్యాంపస్ డ్రైవ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రతిభావంతులకు భవిష్యత్తునిస్తున్న బయోకాన్ కంపెనీని స్వాగతించారు. బయోకాన్ కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు మౌఖిక పరీక్ష నిర్వహించి 160 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు ప్రొఫెసర్ చంద్రమతి శంకర్, ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధులు డాక్టర్ లలిత, డాక్టర్ గణేష్‌నాయక్, డాక్టర్ సుభాష్‌చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి.. క్యాంపస్ డ్రైవ్‌కు హాజరైన యువత

చెన్నూరు సీఐగా క్రిష్ణారెడ్డి



చెన్నూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా ఎం.క్రిష్ణారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూరులో అవినీతికి అవకాశం ఇవ్వకుండా విధులు నిర్వహిస్తానని, ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండేట్లు చేస్తామన్నారు. ప్రజలు నిర్భయంగా పోలీసుస్టేషనుకు వచ్చి తమ సమస్యలు చెప్పి న్యాయం పొందవచ్చున్నారు. అయితే అదే సమయంలో చెడు పనులకు అవకాశం ఇచ్చేవారికి ఆ దోవ నడిచే వారికి పోలీసులు తమ దైన రీతిలో సమాధానం చెబుతారని ఆయన అన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్, ఇసుక అక్రమరవాణా, పేకాట, గంజాయి వంటివాటిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. అలాగే ప్రజలకు 24గంటలు అందుబాటులోఉంటామని ఒక్క ఫోన్ కాల్ కొడితే ఏ సమయంలో అయినా సమస్య ఉన్నచోటికి వస్తామన్నారు. అలాగే పోలీసులు కూడా స్టేషన్‌కు వచ్చేవారి పట్ల నిజాయితీగా నిబద్ధతతో వ్యవహరించేలా చూస్తామని, ఏ చిన్న సమస్య కూడా మధ్యవర్తులతో కాకుండా నేరుగా స్టేషన్‌కు వచ్చి సంప్రదించాలన్నారు. కాగా ఇక్కడ సీఐగా పనిచేస్తున్న ఆర్.పురుషోత్తంరాజు గురువారం కడపకు బదిలీ అయ్యారు.

షర్మిలాను కలిసిన విజయజ్యోతి



కడప కలెక్టరేట్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వైఎస్ షర్మిలాను గురువారం విజయవాడలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి, కాంగ్రెస్ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పురోగతి, భవిష్యత్తు కార్యాచరణపై విస్తృతంగా చర్చించినట్లు విజయజ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సలావుద్దీన్, పులివెందుల అసెంబ్లీకో-ఆర్డినేటర్ ధ్రువకుమార్ రెడ్డి,జమ్మలమడుగు కో-ఆర్డినేటర్ శివమోహన్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ డాక్టర్ అన్వర్,గౌస్‌పీర్, ముబారక్, సిద్దిక్ తదితరులున్నారు

ఉర్దూ స్కూలును అప్పర్ ప్రైమరీగా కొనసాగించాలి



ఎంఈవోతో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధి లోని బీడీకాలనీలో ఉన్న ఉర్దూ స్కూలును అప్పర్ ప్రైమరీ స్కూలుగా కొనసాగించాలని బీడీ కాలనీకి చెందిన మహిళలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఎంఈవో బేబీకి వినతిపత్రం అందించారు. అనంతరం బీడీ కాలనీలోని ఉర్దూ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1998 నుంచి ఇక్కడ ఉర్దూ స్కూలు ఏర్పాటైందని అప్పటి నుంచి ఎలిమెంట్ స్కూలుగా ఏర్పాటు చేశారని అనంతరం అప్పర్‌ప్రైమరీ స్కూలుగా ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 85 మంది విద్యార్థులున్నారని, అలాంటి పాఠశాలను మళ్లీ ఎలిమెంటు స్కూలుగా మార్చడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తలను వేరు చేయాలి



తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానం చూపుతున్న డీపీవో రాజ్యలక్ష్మి

చెన్నూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు తడి పొడి చెత్తలను అందించే సమయంలో వాటిని వేర్వేరుగా అందించేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. రెండోరోజు ఎస్‌డబ్ల్యూపీసీలో ఖాజీపేట మండలంలోని గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖాజీపేట మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొనగా, తడి పొడి చెత్తను ఎలా వేరు చేయాలి,ఎలాఅందించాలన్నదానిపై ప్రయోగాత్మకంగా డీపీవో సూచించారు.

పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి



గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు

వల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో నివశించే ప్రజలందరూ పరిశుభ్రతకు మొదట ప్రాధాన్యత నివ్వాలని వల్లూరు గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. వల్లూరులో జరుగుతున్న హరిత రాయబారుల శిక్షణలో భాగంగా రెండో రోజుమండల పరిధిలోని గ్రీన్ అంబాసిడర్లను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లారు. ముందురోజు ఇచ్చిన శిక్షణలో భాగంగా వారు తీసుకున్న తర్ఫీదులో ప్రతి ఇంటికీ వెళ్లి తడి,పొడి చెత్తను ఎలా తీసుకోవాలన్న విధానం పట్ల అవగాహన కల్పించారు.

గొలుసు చోరీ నిందితుడికి రిమాండ్

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం సచివాలయం వద్దకు వచ్చిన వెంకటసుబ్బమ్మ అనే వృద్ధురాలి మెడలో ఉన్న గొలుసు చోరీకి గురైన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు చోరీకి పాల్పడ్డ దేవరగుట్టపల్లెకు చెందిన కోలా జగదీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. అతని నుంచి బగారు చైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజలకు ఆధార్ అవస్థలు..!

- పులివెందులలోఒకే ఒక్క బ్యాంకులో అప్‌డేట్ సేవలు
- సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు
- రోజుకు 30 మంది మాత్రమే అప్‌డేట్
- తప్పని నిరీక్షణ



పులివెందుల యూనియన్ బ్యాంకు వద్ద ఆధార్ సేవల కోసం నిరీక్షిస్తున ప్రజలు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఆధార్ కష్టాలు తప్పడంలేదు. అర్హులకు సంక్షేమ పథకాలు వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం రేషనుకార్డు లబ్ధిదారులకు ఈకేవైసీ నమోదు ప్పనిసరి చేసింది. ఆధార్‌లో పేర్లు, అడ్రస్, వివరాలు తప్పులు ఏమైనా ఉంటే సరిదిద్దుకోవాలని సూచించింది. ఇందులో భాగంగా ఐదేళ్లు దాటిన చిన్నారుల వేలిముద్రలు అప్‌డేట్ చేసుకునేందుకు గాను రేషన్‌కార్డుదారులు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి చేసిం ది. దీంతో విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ ఉంటేనే తల్లికి వందనం, ఇతర పథకాలు అందుతాయి. లేదంటే ప్రభుత్వ పథకాలు అందవు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం ఆపార్ తీసుకువచ్చింది. దీనికి సైతం ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి. ఈ ఆధార్ అప్‌డేట్‌ను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో పట్టణంలోని యూనియన్ బ్యాంకులో మాత్రమే ఆధార్ అప్‌డేట్ సేవలకు అవకాశం కల్పించింది. ఇందులో రోజుకు 30 మందికి మాత్రమే వేలిముద్రల వివరాలు అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో చిన్నారుల తల్లిండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్నారు. పులివెందుల చుట్టుపక్కల ప్రాంతాల వారు కూడా యూనియన్ బ్యాంకుకు ఆధార్ అప్‌డేట్ కోసం రావాల్సి వస్తుంది. దీంతో రోజుకు ఎక్కువ సంఖ్యలో బ్యాంకుకు చేరుతున్నారు. ఉదయం 6గంటల నుంచే బ్యాంకు వద్ద కొంత మంది ప్రజలు చేరుకుని పడిగాపులు కాస్తున్నారు. పాఠశాలలో నమోదు చేసిన పేరు, వివరాలు ఆధార్‌లో ఒకే విధంగా ఉండాలన్న నిబంధనలతో విద్యార్థులకు మరిన్ని కష్టాలు తప్పడంలేదు. దీంతో తాము ఇబ్బందులు పడి ఆధార్ అప్‌డేట్ కోసం వస్తున్నామని ప్రజలు అంటున్నారు. తమ ఇబ్బందులు తొలగాలంటే మరికొన్ని ఆధార్ సెంటర్లు ను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

వల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి 11వతేదీ వరకు ఆధార్‌క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఘురాం అన్నారు. మండలంలోని ప్రజలు అప్పుడే పుట్టిన బిడ్డల నుంచి 15 ఏళ్లలోపు పిల్లందరికీ ఆధార్ కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. సరైన ధృవపత్రాలతో వె ళ్లాలని సూచించారు. 4న తోళ్లగంగనపల్లె, 5న దిగువపల్లె, 8న గోటూరు, 9న పైడికాల్వ, 10న కొట్లూరు, 11న అంబవరం గ్రామాల్లో పంచాయతీ సచివాలయాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. చిరునామా మార్పు, ఫొటో మార్పు, ఫోనునెంబరు లింకు, వేలిముద్రలు అప్‌డేట్‌లు చేస్తామని ఎంపీడీవో తెలిపారు.

ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం కడప నగరం యూటీఎఫ్ భవన్ ఎదుట ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వై.రవి కుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఎస్.ఏజాస్ అహ్మద్, తదితరులుపాల్గొన్నారు.

'జనసైనికుడిపై దాడి దారుణం'

కడప సెవెన్ రోడ్స్ ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజవకర్గ సావిపాయి మండల జనసేనపార్టీ కార్యకర్త గుగ్గిళ్ల వెంకటేశ్‌పై వైసీపీ నాయకులు దాడి చేయడం దారుణమని, ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కడప జనసేన నాయకుడు తుంగా రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ శాంతియుత రాజకీయాలకు కట్టుబడి ఉందన్నారు. కానీ కార్యకర్తలపై దాడులను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జనసైనికుడిపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై తక్షణం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యలను తక్షణం పరిష్కరించాలి



పులివెందులలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ సిబ్బంది

పులివెందుల రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటివకీ నెలకొని ఉన్న అపరిష్కృత సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం పులివెందుల ఆర్టీసీ సిబ్బంది ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హజరై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు సీపీ రెడ్డి, కార్యదర్శి ఆర్.కేశవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎం.రెడ్డి, నాయకులు, డ్రైవర్లు, కండక్టర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కడప మారుతీనగర్..: ఆర్టీసీలో హయ్యర్ పెన్షన్ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కడప డిపో అధ్యక్షుడు తొండలదిన్నె జయరామ్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మూడోరోజు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా గురువారం ఎన్ఎంయూ కడప డిపో ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండులో మొదటి సర్వీసు నుంచి ఎర్ర బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ కడప డిపో కార్యదర్శి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి రామచంద్ర, జయరాంనాయక్, చెన్నారెడ్డి, శ్రీదేవి, హరిప్రసాద్, పీఆర్‌రెడ్డి, సునంద, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కడప రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీ



కడప క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కడప వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ ఆధ్వర్యంలో గురువారం కడప రైల్వేస్టేషనులో తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారించారు. అలాగే రైల్వేస్టేషన్ బయట వాహన తనిఖీలు చేశారు. వాహ నాల రికార్డులను పరిశీలించడంతో పాటు లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సురెన్స్ పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. తనిఖీల్లో ఎస్ఐ అమర్‌నాధరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైజంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. మాసాపేట సర్కిల్ వద్ద టూటౌన్ ఎస్ఐ హుస్సేన్ స్థానికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఎన్‌సీఏపీలో కడపకార్పొరేషన్‌కు రాష్ట్రంలో ప్రథమస్థానం

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ)లో కడప కార్పొరేషన్‌కు రాష్ట్రంలో ప్రథమస్థానం లభించింది. 2024 నాటికి పర్టిక్యులేట్ మ్యాటర్ (పీఎం) సాంద్రతలను 20 నుంచి 30శాతం వరకు తగ్గించడం ద్వారా భారతదేశంలో గాలి నాణ్యతను మెరుగుపరచడానికి 2019లో ఎన్‌సీఏపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.తర్వాత దీనిని 2026 వరకు పొడిగించారు. ప్రతి ఏడాది దేశవ్యాప్తంగా ఫలితాలను ప్రకటిస్తారు.ప్రధానంగా పర్టిక్యులేటర్ మ్యాటర్ (పీఎం) సాంద్రతలను 20 నుంచి 30శాతం తగ్గించడం లక్ష్యం. ఈ నేపథ్యంలో 10పీఎంలో కడప కార్పొరేషన్‌కు 42పాయింట్లులోపు వస్తే ఆ ప్రాంతాన్ని కాలుష్య రహిత ప్రాంతగా గుర్తించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో కడప కార్పొరేషన్‌కు రాష్ట్రంలో ప్రథమస్థానం లభించింది. ఎన్సీఏపీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కడప కార్పొరేషన్‌కు గతంలో రూ.6కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో గాలి నాణ్యతను పెంపొందించేందుకుచేయాల్సిన కార్యక్రమాలను కార్పొరేషన్ నిర్వహించింది.

కొద్దిపాటి వర్షానికే బస్టాండులో నీరు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సూర్యభగవానుడి ఎండ వేడిమి నుంచి కడప ప్రజలకు ఉపశమనం కలిగించే క్రమంలో భాగంగా గురువారం మధ్యాహ్నం కురిసిన చిన్నపాటి వర్షానికి కడప బస్టాండులో వర్షం నీరు నిలబడింది. ఇటీవల కడప బస్టాండు చుట్టూ డ్రైనేజీ కాల్వ నిర్మాణం జరిగినప్పటికీ వర్షం నీరు మాత్రం యథా ప్రకారం బస్టాండులో నిలబడింది. దీంతోప్రయాణికులు కాసింత ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీ కాల్వ నిర్మాణం జరిగిన బస్టాండులో మాత్రం వర్షం నీటితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడి అసహనం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండు చుట్టూ డ్రైనేజీ కాల్వ నిర్మాణం పేరుతో దాదాపు ఐదు నుంచి ఏడు నెలల వరకు నిర్మాణాలు జరిపి అక్కడున్న వ్యాపార సముదాయాలు దెబ్బతినేలా చేశారు. నిర్మాణం జరిగిన నెలలకు సైతం వ్యాపారాలు జరుపుకునే అవకాశం లేకపోయినా బాడుగలు మాత్రం ముక్కుపిండి వసూలు చేశారు. దీంతో నష్టపోయిన నెలలకు గాను కాసింత ఉపశమనం కలిగించేలా బాడుగలు చెల్లించలేమని చెప్పినప్పటికీ కాదు కూడదంటూ వసూలు చేశారు.



బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీరు

చెరువు ఆక్రమించకుండా పెద్దకందకం కొట్టిస్తాం

చెన్నూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కొండపేట చెరువు కబ్జా కాకుండా కందకం తవ్విస్తామని కేసీ కెనాల్ డీఈఈ ఎస్.చిన్నపుల్లయ్య అన్నారు. గత నెల 31న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కొండపేట చెరువు కబ్జా అనే కథనంపై స్పందించారు. కొండపేట చెరువు కేసీ కెనాల్‌లో భాగం కాబట్టి రైతులు ఆక్రమించి సాగు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చెరువు సర్వే చేయించి చెరువు వెంబడి రైతులు లోపలికి పోకుండా పెద్దకందకం కూడా ఏర్పాటు చేయబోతున్నామని ఇందుకు అవసరమైన అంచనాలు కూడా తయారు చేసి పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

ఉచిత పాలీసెట్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

సింహాద్రిపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేటి నుంచి నిర్వహిస్తున్న ఉచిత పాలీ సెట్ శిక్షణను ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసు కోవాలని కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొని పాలీసెట్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించవచ్చున్నారు. విద్యార్థులకు మెటీరియల్ ఉచితంగా కాలేజీ తరఫున ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు సెల్ నెంబరు 9010222184ను సంప్రదించవచ్చున్నారు.

డ్రైడేపై అవగాహన కలిగి ఉండాలి

సింహాద్రిపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): డ్రైడే కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య అన్నారు. గురువారం మండలంలోని బలపనూరు గ్రామంలో ఫ్రైడే డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్‌బాషా, ఆరోగ్య కార్యకర్త గంగాదేవి, ఆశా కార్యకర్తలు శివకామేశ్వరి, దేష్ణ, శైలజ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

పులివెందుల టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 20 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరైంది. వాటికి సంబంధించిన రూ.5.50 లక్షలు చెక్కులను పది మంది లబ్ధిదారులకు నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి సతీమణి లతారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

47వ సారి రక్తదానం

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో రక్తం విలువ తెలిసిన సమాచార పౌర సంబంధాల శాఖ ఫొటోగ్రాఫర్ పీ.ఎండీ.సొహైల్ అలీఖాన్ 47వ సారి రక్తదానం చేశారు. గురువారం కడప జీజీహెచ్‌లో ఓ గర్భిణీకి ప్రసవ సమయంలో అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో సొహైల్ అలీఖాన్ అక్కడి బ్లడ్ బ్యాంకుకు వెళ్లి రక్తదానం చేశారు. రక్తాన్ని స్వీకరించిన గర్భిణీ కుటుంబ సభ్యులు సొహైల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకొని, మానవత దృక్పథంతో ముందుకు రావాలని సొహైల్ అలీఖాన్‌కోరారు.

ఘనంగా సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కీర్తిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతా రామ లక్ష్మణ ఆలయంలో గురువారం రెండో రోజు విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఉదయం 8గంటలకు సుప్రభాత సేవ తదితర పూజలను జరిపించారు. అంతేకాకుండా సాయంత్రం ఆరాధన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి విగ్రహాలను గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

వేంపల్లెకు ఈవోగా రావాలంటే హడల్...!

- మార్కెట్ వేలం వేసే దిక్కేలేరు
- ఆగిన పన్ను వసూళ్లు
- నాలుగు నెలలుగా జీతాలు లేక ఇబ్బందుల్లో సిబ్బంది
- అరకొరగా పారిశుధ్యం...నీటి సమస్య



వేంపల్లె పంచాయతీ కార్యాలయం

వేంపల్లె, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేంపల్లె మేజర్ పంచాయతీ. 60వేలకు పైగా జనాభా ఉంది. నెల రోజులుగా వేంపల్లెకు ఈఓ లేరు. దీంతో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వేసవి కావడంతో భూగర్భజలాలు అడుగంటి తాగునీటి సమస్య తీవ్రతరమవుతోంది. స్థానిక నాయకులు జోక్యం చేసుకొని ఒకటి, రెండు చోట్ల బోర్లు వేసి నీటిని అందిస్తున్నారు. అయిన ఇంకా చాలా చోట్ల నీటి సమస్య ఉంది. ముఖ్యంగా ఇక్కడ పనిచేస్తున్న పారిశుధ్యం, వాటర్ స్కీం సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందిపడుతున్నారు. వేతనాలు రాకుంటే ఎలా పూటగడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు ఇవ్వకుంటే ఇక పనులు ఆపివేయాలనే యోచనలో పారిశుధ్య సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు కూడా ఇప్పటికే చెప్పినట్లు సమాచారం. పంచాయతీలో సుమారు రూ.20లక్షల దాకా డబ్బులు అందుబాటులో ఉన్నా కేవలం ఈఓ లేకపోవడం వల్లే పారిశుధ్య, వాటర్ స్కీం సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఈఓ లేకపోవడంతో పట్టించుకునే వారే కరువయ్యారు. ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న సుబ్బారెడ్డి గత నెల 5వ తేదీన పలు ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. అప్పటి నుంచి పంచాయతీకి ఆదాయం వచ్చే ఇంటి పన్ను, నీటి పన్ను వసూళ్లు నిలిచిపోయాయి. ఏడాదికి ఒకసారి నిర్వహించే మార్కెట్ వేలం గడువు మార్చి 31కి పూర్తయింది. ఈఓ లేకపోవడం వల్లే కానీ టెండర్ నిలిచిపోయింది. ఇక్కడ పనిచేస్తున్న ఈఓలపై అవినీతి ఆరోపణలపై ఫిర్యాదులు ఉండడంతో ఇక్కడకు ఈఓగా వచ్చేందుకు జంకుతున్నారు. వేంపల్లెకు అట్లూరులో పనిచేస్తున్న ఈఓపీఆర్‌ఆర్డీ శివప్రసాద్ జిల్లా అధికారులు వేంపల్లె ఈఓగా నియమిస్తూ ఈఓఆర్డీగా అదనపు బాధ్యతలు ఇచ్చి ఇరవై రోజులు అవుతున్నా ఇక్కడకు వచ్చేందుకు సుముఖంగా లేరని తెలిసింది. ఈ పంచాయతీలోకి ఈఓగా ఎవరు రావాలన్న ఇక్కడున్న అవినీతి కంపుకారణంగా భయాందోళనకు గురవుతూ వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం.

క్రాసింగ్ జొన్న రైతుకు కష్టాలు

● ఎర్రదుంప తెగుళ్లతో పంట దశలో గింజపట్టని వైనం ● లబోదిబోమంటున్న అన్నదాతలు ● ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న వైనం

అట్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): క్రాసింగ్ జొన్న పంట తెగుళ్ల కారణంగా రైతన్నను కష్టాల పాలుచేసింది. దీంతో చేతికి వచ్చే పంట గింజ రాక దిగుబడిలేక అన్నదాతలు లబోదిబోమంటున్నారు. అట్లూరు మండలంలోని పాత అట్లూరు, అట్లూరు, ముత్తకూరు చౌటుపల్లె గ్రామాల్లో క్రాసింగ్ జొన్న, సజ్జ పంటలు రైతులు దాదాపు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి 150 ఎకరాల్లో సాగు చేశారు. నంద్యాల వారి హైటెక్ కంపెనీ యజమానులు రైతులు వద్దకు వచ్చి క్రాసింగ్ జొన్న, సజ్జ పంట క్వింటాళ ధాన్యానికి 5వేలు చొప్పున అందిస్తామని రైతులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కంపెనీ యజమానుల ఆదేశాల మేరకే రైతులు యాజమాన్య పద్దతుల్లో వారు పంపిణీ చేసిన విత్తనాలను సాగు చేశారు. రెండు రకాల విత్తనాలను సాళ్ల పద్ధతి ద్వారా సాగు చేశారు. మూడు నుంచి నాలుగు నెలల లోపు పంట దిగుబడి వస్తుందని, ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని కంపెనీ వారు తెలిపారని రైతులు పేర్కొన్నారు.. యాజమాన్య పద్దతులు ద్వారా మందులు పిచికారి విత్తన శుద్ధి పంట దశ వరకు వారు చెప్పినట్లు చేసినా పంట దశలో ఎర్ర దుంప తెగులు ఆశించడంతో ఎకరాకు క్వింటా నుంచి రెండు క్వింటాళ్ల వరకు దిగుబడి రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వెంటనే కంపెనీ వారిని సంప్రదించగా వారు పంట పొలాలను పరిశీలించి క్రాసింగ్ జొన్న, సజ్జ పంటకు మీ పొలాలు అనుకూలంగా లేవంటూ బుకాయిస్తున్నారన్నారు. ఎకరాకు దాదాపు 30వేల వరకు ఖర్చు చేశామని కంపెనీ వారు ఒప్పందం కుదుర్చుకున్న విధంగా క్వింటాళ్ల ధాన్యానికి 5వేల చొప్పున ఎకరాకు 15క్వింటాళ్లకు దాదాపు 75వేల రూపాయలు ఎకరాకు దిగుబడి వస్తుందని తెలిపారని తీరా పంట దశలో తెగుళ్ల సోకడంతో తీవ్రంగా నష్టపోయామంటున్నారు. ఎలాగైనా కంపెనీ వారు మా నష్టాన్ని భరించాలని కంపెనీ యాజమాన్యంపై ఒత్తిడి పెంచడంతో ఎకరాకు రూ.40వేలు నష్టపరిహారం నెలరోజుల తరువాత మీ అకౌంటులో జమ చేస్తామని కంపెనీ యాజ మాన్యం తెలుపుతున్నారని రైతులు పేర్కొన్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు పంటలను పరిశీలించి తగు న్యాయం చేయుదురని రైతులు కోరుతున్నారు.


ఎర్ర దుంప తెగులు సోకడంతో గింజ పట్టని క్రాసింగ్ జొన్న పంట

వాతావరణ పరిస్థితులు అనుకూలించకే ఇక్కట్లు

అట్లూరు మండలంలో క్రాసింగ్ జొన్న, సజ్జ పంటల నష్టంపై మండల వ్యవసాయాధికారి రామకృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడి రాలేదన్నారు. ఇక పంట సాగుపై విత్తన కంపెనీతో రైతులు ఒప్పందం కుదుర్చుకున్నారని ఆమేరకు వారు సహకరిస్తామని చెప్పారన్నారు. కంపెనీ వారు సహకరించకపోతే ప్రభుత్వ పరంగా స్పందించి రైతులకు న్యాయం చేస్తామన్నారు.

నర్సాపురం రేషన్ షాపు సీజ్


నర్సాపురం రేషన్ షాపులో తనిఖీలు చేస్తున్న డీటీ శివశంకర్

కాశినాయన ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి):నర్సాపురం ప్రభుత్వ రేషన్ షాపును సీజ్ చేసినట్లు తహసీల్దారు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బద్వేల్ ఎన్‌ఫోర్స్‌మెట్ డీటీ శివశంకర్ గురువారం రేషన్ షాపును ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా 25 క్వింటాల బియ్యం,75 కిలోల చెక్కర తక్కువగా ఉన్నట్లు గుర్తించారన్నారు. దీంతో షాపును సీజ్‌చేసి 6ఏ కేసు నమోదు చేశారని తెలిపారు.

ఇంటర్ క్లాసులు ప్రారంభం

● మధ్యాహ్న భోజనం ఏర్పాటు
● ఫస్టియర్‌కు బ్రిడ్జి క్లాసులు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఇంటర్ క్లాసులు ప్రారంభమైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ త్రివిక్రంరెడ్డి తెలిపారు. సెకండియర్ క్లాసులు ఇప్పటికే మొదలైనట్లు, ఫస్టియర్ అడ్మిషన్స్‌తోపాటు బ్రిడ్జిక్లాసులు 7వ తేదీనుంచి ప్రారంభమౌతు న్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ తెలుగు, ఇంగ్లీషు మీడియంలో ఒక్కోకోర్సులో 110 సీట్లు మొత్తం 440 సీట్లు ఉన్న ట్లు తెలిపారు. అందరికి పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 23వర కు ఈక్లాసులు జరుగుతాయన్నారు. తరగతులు ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతా యన్నారు.

రేపు సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్‌పై ఈనెల 5వ తేదీన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రిఫ్లెక్షన్ ఐఏఎస్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, వివేకానందరెడ్డిలు తెలిపారు. 5న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు ఉంటుందన్నారు. విద్యార్థులు, యువత ఈ సదస్సులో పాల్గొని సివిల్ సర్వీసెస్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

ప్రతి రైతు రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలి


రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో

ముద్దనూరు ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి)ప్రతి రైతు రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండల పరిధిలోని పెనికెలపాడు -1 రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఏవో ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామంలో 345 మంది రైతులు ఉండగా 268 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మిగతా రైతులు త్వరలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ సుచరిత రైతులు పాల్గొన్నారు.

కొండాపురంలో వర్షం

కొండాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల గురువారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. గత నెల రోజులుగా వేసవితాపంతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఒకింత ఉపశమనం కలిగిందని చెప్పవచ్చు. అదేవిధంగా పలుచోట్ల బోర్లలో నీరు అడుగంటి పోవడంతో వర్షం వల్ల కొంతమేర ప్రయోజనం చేకూరుతుందని రైతులు, ప్రజలు భావిస్తున్నారు.

చల్లగిరిగెలలో శ్రీరామనవమి ఉత్సవాలు


పట్టాభిరామాలయంలో కొలువుదీరిన సీతారాములు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల మండలంలోని చల్లగిరిగెల గ్రామంలోని రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గత 58 ఏళ్లుగా విశ్వశాంతి లోక కళ్యాణార్థం సప్తాహ భజన మహోత్సవాలు నిర్వహించడం, ఇందులో భాగంగా ప్రతి ఏడాది ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు ఏకాంబర నామ జపం, అన్నదానాలు జరుగుతుంటాయి. కాగా ఈనెల 6వతేదీన సీతారామస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఆలయంలో శ్రీకృష్ణఅలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.. 4నమోహినీ అలంకారం, 5న వెంకటేశ్వరస్వామి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. 6న సాయంత్రం బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని ఇందులో గెలిచిన వృషభరాజములకు ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ బహుమతి రూ.30వేలు, నాలుగో బహుమతి రూ.15 వేలు, ఐదో బహుమతి రూ.10వేలు అందిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆదేశాలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న వెంకటయ్యయాదవ్

బద్వేలు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ బోర్డు ఆదేశాలను పాటించని జూనియర్ కళాశాలలపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంటా వెంకటయ్యయాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుంచి 24 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు క్లాసులు నిర్వహించాలన్న ఆదేశాలున్నాయని కానీ జిల్లాలో ఉన్న ప్రైవేటు జూనియర్ కళాశాలలు క్లాసులు నిర్వహించకుండా బోర్డు ఆదేశాలను ధిక్కరించడం దారుణమన్నారు. క్లాసులు నిర్వహిస్తే ప్రైవేటు లెక్చరర్లకు జీతాలు ఇవ్వాల్సి వస్తుందని యాజమాన్యాలు ఈ చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ప్రైవేటు టీచర్‌లు, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఆయుర్వేద కాన్ఫరెన్స్‌కు భవానీశంకర్‌కు ఆహ్వానం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఇంటర్నేషనల్ ఆయుర్వేద కాన్ఫరెన్స్‌కు తనకు ఆహ్వానం అందినట్లు ఆయుర్వేద వైద్యుడు పెరుగు భవానీశంకర్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా ఆయుర్వేద అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఆయుర్వేదంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వంటింటిలో ఉండే దినుసులతోనూ, మనపరిసరాల్లో పెరిగే మూలికల ద్వారా అనేక రకాల వ్యాధులను నయం చేసుకోవచ్చునని తెలిపారు. నేల ఉసిరి, తిప్పతీగె, ఉత్తరేణి వంటి మొక్కలు మన చుట్టుపక్కల పెరుగుతున్నాయని, అవి మన ఆరోగ్యానికి తోడ్పడుతాయన్నారు. వాటిని పిచ్చి మొక్కలుగా భావించి తొలగించవద్దని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ జిల్లా ప్రముఖ్ మల్లికార్జున, జిల్లా కార్యదర్శి విజయకుమార్ పాల్గొన్నారు.-

గుడి ప్రారంభాన్ని అడ్డుకుంటున్నారంటూ ఆందోళన

● ఖాజీపేట పోలీసు స్టేషన్ ఎదుట గ్రామస్థుల ధర్నా


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ, తదితరులు

ఖాజీపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తుడుమలదిన్నెగ్రామస్థులు కలిసికట్టుగా అంకాళమ్మ గుడిని నిర్మించుకుంటే కొందరు అడ్డుకుంటున్నారని గురువారం స్థానికులు ఆందోళనకు దిగారు. చందాలు వేసుకుని దాదాపు రూ.50 లక్షలతో గుడిని నిర్మించుకుంటే అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి ఆలయ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతోఆగ్రహించిన గ్రామస్థులు కలిసికట్టుగా గుడిని నిర్మించుకుంటే కొందరు రాజకీయ లబ్ధికోసం ప్రారంభాన్ని అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. మార్చి నెలలో ఆలయం ప్రారంభోత్సవం జరగాల్సి ఉండగా వాయిదా పడిందని, తిరిగి ఈనెల 18 నుంచి మూడు రోజులపాటు అమ్మవారిని ప్రతిష్ఠించాలనుకుంటే మరలా అడ్డంకులు సృష్టిస్తున్నారని గ్రామ కమిటీని పోలీసు స్టేషన్‌కు రమ్మని చెప్పడంతో గ్రామస్థులు ఆగ్రహించి గురువారం రాత్రి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా మీరు మాకు న్యాయం చేయలేదంటూ సీఐ మోహన్‌ను గ్రామస్థులు నిలదీశారు. అంత టితో ఆగకుండా గ్రామస్థులు మైదుకూరు డీఎస్పీ ఆఫీసుకు ట్రాక్టర్లలో తరలి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అంతలోపు బస్టాండు కూడలి లోతుడుమలదిన్నె గ్రామానికి చెందిన శ్రీనివాసులరెడ్డి, తిమ్మారెడ్డిపల్లెకు చెందిన వేమారెడ్డిలు ఘర్షణ పడడంతో గ్రామస్థులు తిరిగి పోలీసు స్టేషన్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేస్తూ న్యాయం చేయాల్సిన పోలీసులే కొందరికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు.

అడ్డుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే

రెండు దఫాలుగా అంకాళమ్మ గుడి ప్రారంభాన్ని స్థానిక ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారని గ్రామస్థులు పోలీసు స్టేషన్ ఎదుట బహిరంగంగా నినాదాలు చేశారు. కొంతమంది స్వార్థపరులు తప్పుడు సమాచారం ఇస్తున్నారని అలాంటివారిని నమ్మకుండా నిజానిజాలు నిగ్గుతేల్చాలని వారు కోరారు. అనంతరం సీఐ శివశంకర్ యాదవ్ ఆందోళన చేస్తున్న గ్రామస్థులతో మాట్లాడి సమస్యను శాంతియుతంగా పరిష్కరిస్తానని ఆందోళన విరమించి వెళ్లాలని వారికి సర్దిచెప్ప పంపించివేయడంతో పరిస్థితి సర్దుమణిగింది.

బోర్లు అందుబాటులోకి తీసుకురావాలి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి కోసం బోర్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీపీఐ నాయకులు పిడుగుమస్తాన్, రవికుమార్‌లు డిమాండ్ చేశారు. గురువారం పోరుమామిళ్ల ఏవో రమణయ్యకు వారొక వినతిపత్రం అందించారు. మండలంలోని 17 పంచాయతీల్లో బోర్లను చాలా వరకు మరమ్మతులు చేయడంలేదన్నారు. ప్రతి పంచాయతీకి రెండు నూతన బోర్లు మండలంలో అవసరం ఉందన్నారు. కార్యక్ర మంలో సీపీఐ ఏరియా కార్యవర్గసభ్యులు కేశవ, చెన్నయ్య, ఫిరోజ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

కొండాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) మందకృష్ణ మాదిగ వర్గానికి చెందిన ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో గురువారం ఎన్నుకున్నారు. ఇందులో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షునిగా లక్ష్మీనారాయణ, ఎంఎస్పీ మండల అధ్యక్షునిగా పెద్దమల్లయ్య, ఉపాధ్యక్షునిగా నాగాంజితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కేఎస్‌రాజు, తులసీరాముడు తదితరులు పాల్గొన్నారు.

పేదల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

బద్వేలు , ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని పేదలు నివాసం ఉంటున్న ఐలమ్మ కాలనీ, సుందరయ్య కాలనీ, జ్యోతి బస్సు కాలనీ, మార్తమ్మ కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా కాలనీలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారు పాత మున్సిపాలిటీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీను, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్వేష్, జిల్లా కమిటి సభ్యులు చాంద్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి వ్యాయామం చక్కని తోడ్పాటు


జిమ్‌ను ప్రారంభించి పార్కులో ఉల్లాసంగా గడిపిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నిత్యం క్రమం తప్పకుండా నడక, వ్యాయామాల ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గోపవరం పంచాయతీలో ఉన్న హౌసింగ్‌బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన ఓపెన్ ఎయిర్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. సుమారు రూ.6 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన ఈ జిమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ గోపవరం పంచాయతీ పరిధిలోని భగత్‌సింగ్‌కాలనీ, హౌసింగ్ కాలనీవాసులు నడకతోపాటు ఈ పార్కులో ఆరోగ్యకరంగా ఉండేందుకు వ్యాయామ పరికరాలను వినియోగించుకోవాలన్నారు. ఇందులో పిల్లలు, మహిళలు, వృద్ధులకు వ్యాయామాలు చేసే వీలుగా సుమారు పది రకాల వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. జిమ్ ప్రారంభం అనంతరం అక్కడి సౌకర్యాలను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పరిశీలించి కాసేపు సరదాగా జిమ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఈవోపీఆర్‌డీ రామాంజనేయులరెడ్డి, గోపవరం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సామాజిక కార్యకర్త ఈశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకులు బచ్చల వీరప్రతాప్, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల కోసం స్థల పరిశీలన


ముద్దనూరులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

కొండాపురం/ముద్దనూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కొండాపురం, ముద్దనూరు మండలాల్లో ప్రభుత్వ కార్యాయాల ఏర్పాటు కోసం జమ్మలమడుగు ఆర్డీవో ఆదిమూలంసాయిశ్రీ గురువారం స్థలాలను పరిశీలించారు. మండ ల కేంద్రమైన కొండాపురంలో ప్రభుత్వ జూని యర్ కళశాల నిర్మాణం కోసం ఆర్డీవో పాత కొండాపురం ఆర్‌అండ్ ఆర్ సెంటర్ వద్ద కేటాయించిన ఒక ఎకరా 70 సెంట్ల స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతం కొండలో ఉండటంతో కాలేజికి అనువుగా ఉందా? లేదా? అని ఆర్డీవో పరిశీలించారు. అనంతరం తాళ్లప్రొద్దుటూరు ఆర్ అండ్ ఆర్ సెంటర్ వద్ద కమ్యూనిటీ హాలును కూడా ఆర్డీవో పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో రీసర్వే, రెవెన్యూ సదస్సుల గురించి ఆర్డీవో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప, డీటీ మీనా, ఆర్ఐ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా ముద్దనూరు మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని గురువారం ఆర్డీవో సాయిశ్రీ పరిశీలించారు. తాడిపత్రి హైవే రోడ్డులోని చెన్నారెడ్డి పల్లె వద్ద సర్వే నంబరు56-3 లోని0.78 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో భారీగా కూటమిలో చేరిక

● పార్టీ కండువాలు కప్పుకున్న నలుగురు మాజీ సర్పంచులు, ఉప సర్పంచి


ఎమ్మెల్యే ఆది సమక్షంలో కూటమిలో చేరిన తమ్మలపల్లె మాజీ సర్పంచులు, నాయకులు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సమక్షంలో ఎర్రగుంట్ల మండలంలోని తుమ్మలపల్లెకు చెందిన నలుగురు మాజీ సర్పంచులు, ప్రస్తుత వైస్ సర్పంచి వైసీపీ నుంచి కూటమిలోకి చేరారు. గురువారం గ్రామానికి చెందిన ఉప సర్పంచి గోర్ల శకుంతలమ్మ, ఆమె భర్త వెంకటరమణయ్య, మాజీ సర్పంచులు కడుముల రామమోహన్‌రెడ్డి, ఎర్రవల్లి రామ ఓబుల్‌రెడ్డి, గోర్ల శ్రీను, కుడుముల మునిరెడ్డి ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి సమక్షంలో కూటమిలో చేరారు. వారికి కూటమి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కూటమిలో చేరిన వారిలో ఉపసర్పంచి, మాజీ సర్పంచ్‌లతోపాటు నాయకులు మునిభాస్కర్, మురళి, ప్రతాప్‌రెడ్డి, సోమిరెడ్డి, రాంప్ర సాద్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, బ్రహంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, గంగాదర్‌రెడ్డి, సురేంద్రాఎడ్డి, వెంకటశివారెడ్డి, సునీల్ తదితరులు ఉన్నారు. కాగా నలుగురు మాజీ సర్పంచులు, ప్రస్తుత ఉపసర్పంచి కూటమిలో చేరడంతో తుమ్మలపల్లిలో వైసీపీకి బారీగా గండిపడిందని చెప్పవచ్చు.

ఎర్రబ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన


ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన కార్మికులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో గురువారం ఏపీఎస్‌ఆర్‌టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆమేరకు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వారు జమ్మలమడుగులో విలేకరులతో మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులపాటు కార్మికులు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారన్నారు. ఉద్యోగులకు పెంచిన భారాన్ని తట్టుకోలేక ఎందరో ఉద్యోగులు మృతిచెందారన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికులకు శానిటేషన్ పరికరాలు పంపిణీ


శానిటేషన్ పరికరాలు అందజేస్తున్న ఛైర్‌పర్సన్ శివమ్మ, కమిషనర్

జమ్మలమడుగు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఛైర్‌పర్సన్ శివమ్మ, కమిషనర్ వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్లు పారిశుధ్య సిబ్బందికి శానిటేషన్ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుంచి మున్సిపాలిటీలో శానిటేషన్‌కు సంబంధించిన వస్తువులు, ఇతర పరికరాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశాల మేరకు డస్ట్‌బిన్‌లు, స్ప్రేయర్లు, ఫాగింగ్ మిషన్లు తదితర పరికరాలను తెప్పించినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం జమ్మలమడుగు మున్సిపాలిటీకి శానిటేషన్‌కు సంబంధించి ఇబ్బందులు తొలిగాయని, స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు 12 నెలలు వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నేతలు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం చెల్లించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఉపాధ్యాయులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయని, శ్రమకు తగిన వేతనం లభించక ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి సంవత్సరం ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలు ఉపాధ్యాయులకు మాత్రం పది నెలలకు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నాయన్నారు. విద్యార్థులకు మంచి మార్కులు, ర్యాంకులు రావాలన్నా పాఠశాలలో అడ్మిషన్లు జరగాలన్నా ఉపాధ్యాయులదే కీలకపాత్ర అన్నారు. అయినా యాజమాన్యాలు ఉపాధ్యాయులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడం లేదని, ఉద్యోగ భద్రత కూడా లేదన్నారు. సంవత్సరాల తరబడి పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న వారు మాత్రం అరకొర వేతనాలతోనే జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షులు మేరీకుమార్, ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యతోపాటు భద్రత కల్పించాలి


మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

బద్వేలుటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు వారికి భద్రత, భరోసా ఇవ్వాలని సీఐ రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓలు చెన్నయ్య, రఘురామిరెడ్డిలు పేర్కొన్నారు. గురువారం బాలుర ఉన్నత పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం, పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులతో అర్బన్‌సీఐ రాజగోపాల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి ఎక్కువ సమయం గురువులతోనే ఉంటారని, వారికి విద్యతోపాటు అవసరమైన భద్రతను కల్పించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకునేలా పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి, ఉపా ధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనాలకు పేర్లు నమోదు చేసుకోండి

బద్వేలుటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక ఉపనయనాలకు పేర్లు నమోదు చేసుకోవాలని బ్రాహ్మణసంఘం నాయకులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ శర్మలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రమాదేవిసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూజగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా బ్రాహ్మణవటువులకు సామూహిక ఉపనయనాలు నిర్వహిస్తున్నామని, ఈ ఉపనయనాలు చేసుకోదలచిన వారు ఈ నెల 25వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకో వాలన్నారు. వివరాలకు నెంబర్లకు 9440422195, 8328200697, 9481206080ను సంప్రదించాలన్నారు.